విశాఖలో దారుణం



- న్యాయ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం
- పెళ్లి చేసుకుంటానని నమ్మించి స్నేహితుడి గదికి తీసుకువెళ్లి ప్రియుడి అఘాయిత్యం
- ఆ దృశ్యాన్ని రహస్యంగా వీడియో తీసిన అతడి స్నేహితులు
- ఆ వీడియో చూపి, బెదిరించి ముగ్గురూ అఘాయిత్యం

... వివరాలు మెయిన్ 14లో

వణికిస్తున్న జ్వరాలు

ఒక పట్టాన తగ్గడం లేదంటున్న బాధితులు



- వారాల తరబడి కీళ్లు, ఒంటి నొప్పులు...
- ఫ్లూ వైరస్ మ్యుటేషన్స్ వ్యాప్తిచెందడం, వైరస్‌కు యాంటీ బయాటిక్ రెసిస్టెన్స్ పెరగడం, డెంగ్యూ, చికున్‌గున్యా లైక్ ఫీవర్స్... కారణంగా చెబుతున్న వైద్యులు
- అప్రమత్తత అవసరమని హెచ్చరిక
- మందులు వినియోగంలో నిర్లక్ష్యం వద్దని సూచన
- కోర్సు పూర్తిగా వాడకుంటే మళ్లీ తిరగబెట్టే ప్రమాదం

విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):

గడిచిన కొన్నాళ్లుగా జ్వరాలతో జనం అల్లాడిపోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రెండు, మూడు వారాలకుపైగా ఇబ్బందిపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కొందరిలో జాయింట్, బాడీ పెయిన్స్ కనిపిస్తున్నాయి. సాధారణంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నప్పుడు ఈ తరహా వైరల్ ఫీవర్స్ వ్యాప్తిచెందడం సర్వసాధారణం. అయితే, తొలిసారి భిన్నమైన లక్షణాలు కనిపించడంతోపాటు రోజులు తరబడి జ్వరాలు తగ్గడం లేదు. ఇందుకు మూడింటిని (వైరల్ ఫీవర్స్‌లో పెరిగిన మ్యుటేషన్స్ (రకాలు), వైరస్ యాంటీ బయాటిక్ రెసిస్టెన్సీ పెరగడం, డెంగ్యూ, చికున్ గున్యా మాదిరి ఫీవర్స్) కారణంగా వైద్యులు పేర్కొంటున్నారు.

వైరల్ ఫీవర్స్ సాధారణంగా మూడు నుంచి ఐదు రోజులపాటు ఉండి తగ్గుముఖం పడుతుంటాయి. అయితే, ప్రస్తుతం జిల్లాలోని అనేక ప్రాంతాల్లో వైరల్ ఫీవర్స్‌లో కొత్తరకం వ్యాప్తి చెందుతున్నట్టు చెబుతున్నారు. ఇవి అంత తేలిగ్గా తగ్గడం లేదని, రోజుల తరబడి బాధితులు జ్వరంతోపాటు ఇతర లక్షణాలతో ఇబ్బంది పడుతున్నట్టు చెబుతున్నారు. అలాగే వైరస్‌కు యాంటీ బయాటిక్ రెసిస్టెన్సీ పెరగడం మరో కారణంగా వైద్యులు అభిప్రాయపడుతున్నారు. సాధారణంగా ఏదైనా జ్వరం వచ్చినప్పుడు వైద్యులు కొన్నిరకాల మందులను సూచిస్తున్నారు. ఈ మందులను జ్వర లక్షణాలను బట్టి కోర్సు రూపంలో వాడాలి. అయితే, వైద్యులు ఇచ్చిన కోర్సును చాలామంది పూర్తిగా వినియోగించడం లేదు. ఒకటి, రెండు రోజులు వాడిన తరువాత జ్వరం తగ్గుముఖం పట్టడంతో కోర్సును ఆపేస్తున్నారు. అలాగే కొందరు వైద్యులతో సంబంధం లేకుండా లక్షణాలకు అనుగుణంగా మెడికల్ స్టోర్స్‌లో మందులు కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు. దీనివల్ల శరీరంలో చేరిన ఫ్లూ వైరస్‌కు యాంటీ బయాటిక్ రెసిస్టెన్స్ పెరిగిపోతోంది. అరకొరగా మందులు వాడడం వల్ల వైరస్ పూర్తిగా చనిపోకుండా శరీరంలోనే ఉంటోంది. దీంతో ఎప్పటికప్పుడు అది యాక్టివ్ అయి ఇబ్బందులకు గురిచేస్తోంది. ఆ తరువాత మందులు వినియోగించినా ఒక పట్టాన లొంగకుండా రోగిని ఎక్కువ రోజులు మంచానికి పరిమితమయ్యేలా చేస్తోందని వైద్యులు వెల్లడిస్తున్నారు. వీటితోపాటు డెంగ్యూ లైక్ ఫీవర్స్ కూడా వ్యాప్తి చెందుతున్నాయంటున్నారు. ప్రస్తుతం కనిపిస్తున్న జ్వరాలన్నీ ఫ్లూ తరహాలోనే ఉంటున్నాయి. కానీ, లక్షణాలు చూస్తే డెంగ్యూ, చికున్ గున్యా తరహాలో ఉంటున్నాయి. దీంతో వీటిని వైద్యులు కూడా డెంగ్యూ, చికున్ గున్యా లైక్ ఫీవర్స్‌గా పరిగణించి మందులు అందిస్తున్నారు. అందుకే

... మిగతా 6వ పేజీలో

కోర్సు పూర్తయ్యేంత వరకు మందులు వినియోగించాలి

- డాక్టర్ ఐ.కృష్ణమూర్తి, వైద్య నిపుణులు

జ్వరం వచ్చినప్పుడు వైద్యుల సూచన మేరకు మందులు వినియోగించడం మంచిది. ఇష్టం వచ్చినట్టు మందులు కొనుగోలు చేసి వినియోగించడం, వైద్యులు చెప్పిన కోర్సును పూర్తిస్థాయిలో వాడకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయి. బాడీలోని వైరస్‌కు యాంటీ బయాటిక్ రెసిస్టెన్సీ పెరిగిపోయి తరువాత కాలంలో ఇబ్బందులకు గురిచేయవచ్చు. కాబట్టి, వైద్యులు చెప్పిన ప్రకారం కోర్సును జ్వరం, ఇతర లక్షణాలు తగ్గినా పూర్తిగా వాడాలి. దీనివల్ల శరీరంలోని వైరస్ పూర్తిగా నశించిపోతుంది. మధ్యలో వాడడం నిలిపేయడం వల్ల వైరస్‌కు బలాన్ని చేకూర్చినట్టు అవుతుంది. ప్రస్తుత సీజన్‌లో కొన్ని జాగ్రత్తలను పాటించాలి. బయట ఫుడ్‌కు దూరంగా ఉండడం, చల్లని గాలిలో తిరగకుండా ఉండడం ద్వారా చాలా రకాల వైరస్‌ల బారినపడకుండా ఉండవచ్చు.

మందులు పూర్తిగా వాడకుంటే ఇబ్బందులు

- డాక్టర్ కె.రాంబాబు, విమ్స్ డైరక్టర్



ప్రస్తుతం ఫీవర్స్‌లో భిన్నమైన లక్షణాలు కనిపిస్తున్నాయి. ఇందుకు మ్యుటేషన్స్ కారణంగా చెప్పవచ్చు. వీటిని జాగ్రత్తగా పరిశీలించి లక్షణాలకు అనుగుణంగా మందులు వినియోగించాలి. అప్పుడు మాత్రమే వేగంగా కోలుకునేందుకు అవకాశం ఉంటుంది. మందుల పూర్తిస్థాయిలో వాడకపోయినా ఇబ్బందులు తప్పవు. కొందరు టైఫాయిడ్ బాధితులు కొద్దిరోజులు మందులు వాడి తగ్గిందని కోర్సు పూర్తిచేయరు. దీనివల్ల పేగుల్లో టైఫాయిడ్ వైరస్ ఉండిపోయి ఎప్పటికప్పుడు జ్వరం రావడం, పరీక్షలు చేయించుకున్నప్పుడు నిరంతరం పాజిటివ్ చూపించడం జరుగుతుంది. కాబట్టి, మందులు పూర్తిగా వినియోగించడం కీలకం.

ఎయిర్‌పోర్టుకు 27వ ర్యాంకు

- 2023-24 సంవత్సరంలో ప్రయాణికుల రాకపోకల ఆధారంగా ర్యాంకులు విడుదల చేసిన ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ
- 45వ స్థానంలో విజయవాడ, 46వ స్థానంలో తిరుపతి
- 2018-19లో 28.53 లక్షల ప్రయాణికులతో 19వ స్థానంలో విశాఖ విమానాశ్రయం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

దేశంలో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే విమానాశ్రయాల జాబితాలో విశాఖపట్నం విమానాశ్రయం 2023-24 సంవత్సరానికి 27వ ర్యాంకు సాధించింది. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్‌లో తొలి 50 విమానాశ్రయాల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి మూడు స్థానం సాధించాయి. అందులో విశాఖ 27వ స్థానం, విజయవాడ 45, తిరుపతి 46వ స్థానం దక్కించుకున్నాయి.

విశాఖపట్నం విమానాశ్రయం 2018-19 సంవత్సరంలో 28.53 లక్షల మంది ప్రయాణికులతో 19వ స్థానంలో ఉంది. ఆ తరువాత కరోనా వల్ల విమానాలతో పాటు ప్రయాణికుల సంఖ్య కూడా బాగా తగ్గిపోవడంతో ర్యాంకింగ్ క్రమంగా పడిపోయింది. 2019-20లో 24వ ర్యాంకు, 2021-22లో 21, 2022-23లో 26వ ర్యాంకుకు దిగజారింది. 2023-24లో మరో స్థానం తగ్గి 27కు చేరింది. విశాఖ విమానాశ్రయం నుంచి 2022-23లో 9,66,383 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించగా, 2023-24లో అది 10,62,506కు చేరింది. వార్షిక వృద్ధి రేటు

... మిగతా 6వ పేజీలో

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు చెక్

- వినియోగాన్ని నియంత్రించేందుకు 45 రోజులు ప్రణాళిక
- డిసెంబరు నెలాఖరువరకూ అవగాహన కార్యక్రమాలు
- ఆ తరువాత ఎవరైనా ఉపయోగిస్తే చర్యలు
- ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ బ్యాగ్‌లు సరఫరా
- రోడ్ల నిర్వహణ గ్లోబల్ టెండర్ల ద్వారా ప్రైవేటు సంస్థలకు అప్పగింత
- మధురవాడ ప్రాంతానికి తాగునీటిని తరలించేందుకు రూ.295 కోట్లతో నరవ నుంచి పైప్‌లైన్ నిర్మాణం
- జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్

విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):



జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించేందుకు 45 రోజులు ప్రణాళికను అమలు చేస్తున్నామని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో మౌలిక వసతుల కల్పన, పచ్చదనం పెంపు, జీవీఎంసీ స్థలాల పరిరక్షణ, వీధి దీపాల సమస్య పరిష్కారం, నీరు కలుషితం కాకుండా తీసుకుంటున్న చర్యల గురించి వెల్లడించారు. నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పెనుసమస్యగా తయారైందని, దీనిని అధిగమించేందుకు 'ఏకో వైజాగ్ కార్యక్రమాన్ని ముమ్మరం చేయబోతున్నామన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువులను డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డిసెంబరు చివరి వరకూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, తర్వాత కఠిన చర్యలకు దిగుతామన్నారు.

నగరంలో రోడ్ల నిర్వహణను ఏప్రిల్ నుంచి గ్లోబల్ టెండర్ల ద్వారా ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించబోతున్నామన్నారు. జీవీఎంసీ పరిధిలో 40 అడుగులకు మించి వెడల్పు కలిగిన 253 కిలోమీటర్ల రోడ్లకు ఆధునిక హంగులు చేకూర్చబోతున్నామన్నారు. ఐదేళ్లపాటు ఒకే కాంట్రాక్టర్‌కు రోడ్ల నిర్వహణ, నిర్మాణ బాధ్యతలను అప్పగించాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారని, 2026 జనవరి నాటికి రోడ్ల స్వరూపం మారిపోతుందని కమిషనర్ ఆశాభావం వ్యక్తంచేశారు. నగర ప్రజలందరికీ అవసరమైనంత మేరకు నీటి సరఫరా చేయడంపై దృష్టిపెట్టామన్నారు. మధురవాడ ప్రాంతానికి తాగునీటిని తరలించేందుకు రూ.295 కోట్లతో నరవ నుంచి ముడసర్లోవ మీదుగా పైప్‌లైన్ నిర్మాణం చేపట్టబోతున్నట్టు ఆయన తెలిపారు. జోన్-2 (మధురవాడ),

... మిగతా 6వ పేజీలో

72 చోరీ కేసుల్లో 102 మంది అరెస్టు

- రూ.88.52 లక్షలు విలువైన సొత్తు స్వాధీనం
- సీపీ శంఖబ్రతబాగ్చి



బాధితులకు రికవరీ సొత్తు అందజేస్తున్న సీపీ

విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):

పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన చోరీలకు సంబంధించి 72 కేసుల్లో 102 మందిని అరెస్టు చేసినట్టు సీపీ శంఖబ్రతబాగ్చి తెలిపారు. కమిషనరేట్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్టోబరులో నగర పరిధిలో 116 సొత్తు అపహరణ కేసులు నమోదయ్యాయన్నారు. అందులో 72 కేసులను తమ క్రైమ్ విభాగం అధికారులు, సిబ్బంది ఛేదించారన్నారు. చోరీలకు పాల్పడిన 102 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.88.52 లక్షలు విలువైన సొత్తును రికవరీ చేశారన్నారు. రికవరీ చేసిన వాటిలో 742.97 గ్రాముల బంగారం, 326.48 గ్రాముల వెండి, రూ.2.88 లక్షలు నగదు, 20 మోటారు సైకిళ్లు, మూడు ఆటోలు, ఒక లారీ, 298 సెల్‌ఫోన్‌లు, ఒక ల్యాప్‌టాప్ ఉన్నాయన్నారు. ఆ సొత్తును బాధితులకు సీపీ అందజేశారు. ప్రతి నెలా రికవరీ మేళా పేరుతో స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తును కోర్టు అనుమతితో బాధితులకు నేరుగా అందజేస్తున్నామన్నారు. అదేవిధంగా నగరంలో నేరాలు నియంత్రించేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. గత నెల 154 చోట్ల అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. అలాగే ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటుచేసేలా, చీకటి ప్రాంతాల్లో లైటింగ్ పెంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో క్రైమ్ డీసీపీ లతామాధురితోపాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యమ కార్యాచరణ

- 23న ఎమ్మెల్యేలతో రౌండ్ టేబుల్ సమావేశం
- 24న పాత గాజువాక నుంచి కొత్త గాజువాక వరకూ ర్యాలీ
- 28 ఉదయం 8 నుంచి 34 గంటల దీక్ష
- స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరించబోమని, సెయిల్‌లో విలీనం చేస్తామని ప్రధాని నరేంద్రమోదీ విశాఖ పర్యటనలో ప్రకటించాలి
- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు



ఉద్యమ పోరాట కార్యాచరణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):

విశాఖ పర్యటనలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరించబోమని, సెయిల్‌లో విలీనం చేస్తామని ప్రకటన చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఇంటక్ కార్యాలయంలో కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నెల 23న విశాఖ జిల్లాలో గల ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాజకీయ పార్టీల అధ్యక్షులతో రౌండ్‌టేబుల్ సమావేశం

... మిగతా 6వ పేజీలో

సదరం... సమస్యలు అనేకం

- అవగాహన లేకపోవడంతో ఇబ్బందిపడుతున్న దివ్యాంగులు
- స్లాట్ బుక్ చేసుకోకుండానే నేరుగా ఆస్పత్రులకు వస్తున్న విభిన్న ప్రతిభావంతులు
- ఉత్తరాంధ్రతోపాటు పక్కనున్న తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి రాక
- స్లాట్ కేటాయించకుండా పరీక్షలు నిర్వహించలేమంటున్న వైద్యులు



సదరం సర్టిఫికెట్ కోసం మండపేట నుంచి కేజీహెచ్‌కు వచ్చిన సత్తిబాబు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సదరం సర్టిఫికెట్ల మంజూరుపై అవగాహన లేకపోవడంతో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్టిఫికెట్ల కోసం ఇటు శ్రీకాకుళం నుంచి అటు పశ్చిమ గోదావరి జిల్లా వరకూ ప్రతిరోజూ పదుల సంఖ్యలో నగరంలోని కేజీహెచ్, మానసిక వైద్యశాల, ఈఎన్‌టీ, కంటి ఆస్పత్రులకు వస్తున్నారు. అయితే, వైకల్యాన్ని నిర్ధారించే పరీక్షలు వైద్యులు నిర్వహించాలంటే తప్పనిసరిగా ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన సదరం వెబ్‌సైట్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి. ఆ సమయంలో మాత్రమే సంబంధిత ఆస్పత్రికి వెళ్లి వైద్యులకు చూపించుకోవాలి. వైద్యుల తనిఖీ అనంతరం ప్రభుత్వం వారి వైకల్యాన్ని నిర్ధారిస్తూ సర్టిఫికెట్ ఇస్తుంది. ఆ సర్టిఫికెట్‌తో ప్రభుత్వం అందించే పెన్షన్‌తో పాటు ఇతర సంక్షేమ పథకాలు పొందవచ్చు. కానీ, ఈ విధానంపై అవగాహన లేక ఎంతో మంది సుదూర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలకు ఓర్చి నేరుగా ఆస్పత్రులకు వస్తున్నారు. తీరా ఇక్కడి వైద్యులు స్లాట్ బుక్ చేసుకోకుండా సదరం సర్టిఫికెట్ ఇవ్వడం సాధ్యం కాదని చెప్పేస్తుండడంతో వారంతా వెనుతిరగాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

సదరం సర్టిఫికెట్ మంజూరుపై దివ్యాంగులకు అవగాహన లేక ఇటువంటి సమస్య ఉత్పన్నమవుతోంది. అదేవిధంగా స్థానికంగా

... మిగతా 6వ పేజీలో

పాసింజర్ రైళ్ల నంబర్లు మార్పు

విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ నుంచి నడిచే పలు ఒరిజినేటింగ్ పాసింజర్ రైళ్ల నంబర్లను మార్పు చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-కిరండోల్ (58501), కిరండోల్-విశాఖ (58502), విశాఖ-రాయపూర్ (58528), రాయపూర్-విశాఖ (58527), విశాఖ-కోరాపుట్ (58538), కోరాపుట్-విశాఖ (58537), విశాఖ-బ్రహ్మపూర్ (58532), బ్రహ్మపూర్-విశాఖ (58531), విశాఖ-గుణుపూర్ (58506), గుణుపూర్-విశాఖ (58505), విశాఖ-భవానీపాట్నా (58504), భవానీపాట్నా-విశాఖ (58503) వంటి రైళ్లు కొత్త నంబర్ల (బ్రాకెట్లలో సూచించినవి)తో నడుస్తాయని పేర్కొన్నారు. అలాగే కటక్-గుణుపూర్ (68433), గుణుపూర్-కటక్ (68434) రైలు కొత్త నంబర్లతో రాకపోకలు సాగిస్తాయన్నారు.

అప్పన్న భూముల వ్యవహారంపై 22న విచారణ

- రీజనల్ కార్యాలయానికి హాజరుకావాలని విచారణ కమిటీకి ఆదేశం

సింహాచలం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానానికి చెందిన భూముల వివరాలను రికార్డుల నుంచి తొలగించినట్టు వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపిన కమిటీ సభ్యులు చంద్రకుమార్, భ్రమరాంబ, పుష్పవర్ధన్‌లు ఈనెల 22న విశాఖలోని రీజనల్ విజిలెన్స్ కార్యాలయానికి రావాలని దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశించారు. సింహాచలం దేవస్థానం,

... మిగతా 6వ పేజీలో

ఆంధ్రజ్యోతి



కార్ అండ్ బైక్ రేస్

నవంబర్ నెల కూపన్ నంబర్ - 2

పాఠకుని పూర్తి పేరు	:	....
డోర్ నెంబరు	:	....
వీధి పేరు	:	....
గ్రామం / పట్టణం	:	....
మండలం	:	....
జిల్లా	:	....
పోస్టల్ పిన్‌కోడ్	:	....
ఫోన్ నంబర్	:	....

నాలుగు నెలల్లో ఆంధ్రజ్యోతి డ్రాలో ఇది నవంబర్ నెల రెండవ కూపన్ ఈ కూపన్‌లో మీ అడ్రస్ పూర్తి చేసి ఈ నెలలో ఇచ్చే మూడు కూపన్లను ఒక సెట్‌గా చేసి మీ వద్దనే ఉంచి నాలుగు నెలలు అయిన తర్వాత మొత్తం 12 కూపన్లను నాలుగు సెట్లుగా చేసి 2025 మార్చ్ నెల 10వ తేది నాటికి ఈ క్రింది అడ్రస్‌కు పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని అందచేయవలెను.



నోట్ : సెట్‌గా కాకుండా విడిగా పంపిన కూపన్లు చెల్లవు.

* చట్ట ప్రకారం నిబంధనలు వర్తించును.

కూపన్లు పంపవలసిన చిరునామా

ఆంధ్రజ్యోతి కార్యాలయం, పోర్టు హాస్పటల్ ఎదురుగా,
NH-16, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-530016
సెల్ : 9985411633, 9985411029

కరాటే చాంపియన్‌కు సాయిశశాంక్‌కు అభినందనలు



సాయిశశాంక్‌ను అభినందిస్తున్న దృశ్యం

మధురవాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన సౌత్ ఇండియా ఇన్విటేషనల్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (సిమ్స్) కళాశాలలో ఎంబీఏ చదువుతున్న గలవెల్లి సాయిశశాంక్ స్వర్ణ పతకాన్ని గెల్చుకున్నారు. ఈ సందర్భంగా విజేతగా నిలిచి సాయిశశాంక్‌ను ఇన్‌స్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపికాదాస్, ప్రిన్సిపాల్ యు.లారెన్స్, డైరెక్టర్ వి.సాయి ప్రశాంత్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

జూట్ కార్మికుల పింఛను మొత్తం పెంచాలి : సీపీఐ

తగరపువలస, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లు కార్మికులకు నామమాత్రంగా చెల్లిస్తున్న పింఛన్ల సొమ్మును పెంచాలని సీపీఐ డిమాండ్ చేసింది. మంగళవారం తగరపువలసలో సీపీఐ నేత కానూరి రాంబాబు అధ్యక్షతన జీఆర్ భవన్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలామంది కార్మికులకు రూ.వెయ్యి కూడా పింఛనుగా రావడం లేదని, కనీస పింఛను రూ.5 వేలు చేయాలన్నారు.సామాజిక పింఛన్లు కూడా రూ.నాలుగు వేలు ఇస్తున్న పరిస్థితుల్లో వీరికి కార్మిక శాఖ ఇస్తున్న పింఛన్లు నామమాత్రంగా ఉండడం శోచనీయమన్నారు. కొంతమంది కార్మికులకు రూ.వెయ్యి పింఛను కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో జూట్‌మిల్లు పింఛనుదారులు, సీపీఐ నేతలు మోరఅప్పలరాజు, సన్నిబాబు, లక్ష్మణరావు, గోవిందరావు, రామారావు, మావూరి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీ లక్ష్మీబాయ్‌కి బీజేపీ మహిళా మోర్చా నివాళులు

విశాలాక్షినగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఝాన్సీ లక్ష్మీబాయ్ 196వ జయంతిని పురస్కరించుకుని జీవీఎంసీ 9వ వార్డు పరిధిలోని విశాలాక్షినగర్‌లో విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాత ఆధ్వర్యంలో ఝాన్సీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ ఝాన్సీ లక్ష్మీబాయ్ ధైర్యసాహసాలను కొనియాడుతూ సిపాయిల తిరుగుబాటులో పోషించిన పాత్రను వివరించారు. కార్యక్రమంలో 9వ వార్డు బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు షేక్ వసంత పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న ఆర్జిత సేవలు



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామికి పలు ఆర్జిత సేవలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాత ఆరాధనలను యథావిధిగా పూర్తి చేశాక భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కంకణ ధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ చేసి మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణాన్ని జరిపారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. అలాగే గరుడసేవను నిర్వహించారు.

దివ్యాంగునికి ట్రైసైకిల్ అందజేత

భీమునిపట్నం (రూరల్), నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటితూరు గ్రామానికి చెందిన తాటిపూడి సత్తిబాబు అనే దివ్యాంగునికి సర్పంచ్ ఎస్.సంతోషికుమారి మంగళవారం ట్రై సైకిల్‌ను అందజేశారు. ఈ ట్రై సైకిల్ సత్తిబాబుకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో దళిత నాయకుడు పతివాడ రాంబాబు, శాలివాహన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

భీమునిపట్నం (రూరల్), నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నవరం సమీపం తూడెం ఉన్నత పాఠశాలలో దివీస్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించి సుమారు 230 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ తిరుపతిస్వామి మాట్లాడుతూ చిన్నారులకు తరచూ వచ్చే వివిధ రుగ్మతల నివారణకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం అప్పన్న, దివీస్ అధికారులు సురేశ్ కుమార్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.50 వేల విరాళం

భీమునిపట్నం (రూరల్), నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటితూరు వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని శ్రీవారి విగ్రహం చుట్టూ మకరతోరణం చేయించడానికి గాను స్థానిక శాలివాహన సంఘం ప్రతినిధులు మంగళవారం రూ.50 వేలను విరాళంగా సర్పంచ్ సంతోషికుమారికి అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్త అన్నపూర్ణాదేవి, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మించాలని కోరుతూ ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న రిక్షా కాలనీవాసులు

కొమ్మాది, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : తమ ప్రాంతంలో ఉన్న 50 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించి కాలనీవాసులకు కమ్యూనిటీ హాలు నిర్మించాలని కోరుతూ రిక్షా కాలనీ వాసులు మంగళవారం ధర్నా నిర్వహించారు. గ్రేటర్ విశాఖ 6వ వార్డు పరిధిలోని ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని, ఈ విషయాన్ని చినగదిలి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తెచ్చామని, అయినప్పటికీ ఎలాంటి చర్య తీసుకోవడం లేదని విమర్శించారు. ఈ స్థలంలో సామాజిక భవనం నిర్మాణానికి 2019 నుంచి ప్రతిపాదన ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వం స్థలం కబ్జా కాకుండా పరిరక్షించడమే కాకుండా వెంటనే అక్కడ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిక్షా కాలనీ వాసులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆవేదన పట్టించుకోరా!

- 6వ రోజుకు చేరిన మత్స్యకారుల దీక్ష



జోనల్ కార్యాలయం వద్ద మత్స్యకారుల కొనసాగుతున్న దీక్ష

భీమునిపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంతం వెంబడి ఏర్పాటైన పరిశ్రమలు విడుదల చేస్తున్న రసాయన వ్యర్థాలతో సముద్ర జలాలు కలుషితమై మత్స్యసంపద నాశనమైపోతోందని మత్స్యకార నాయకుడు, గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ జిల్లా మత్స్యకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో భీమిలి జోనల్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న మత్స్యకారుల రిలే నిరాహారదీక్షలు మంగళవారానికి ఆరో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా శిబిరం వద్ద ఆయన మాట్లాడుతూ మత్స్యకారుని జీవన విధానానికి ఎన్ని విధాలుగా విఘాతం ఏర్పడుతున్నా అధికార యంత్రాంగం స్పందించకపోవడం దారుణమన్నారు. గ్రామాభివృద్ధి సేవా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నర్సింగరావు మాట్లాడుతూ మత్స్యకారుల శ్మశానం ఆక్రమణకు గురైందని గగ్గోలు పెడుతున్నా అధికారులు స్పందించకపోవడం చూస్తుంటే మత్స్యకారులంటే ఎంత చులకన భావమో అర్థమవుతోందన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి వాసుపల్లి కొండబాబు, ఎగువపేట, బోయవీధి, తోటవీధి గ్రామాల మత్స్యకార పెద్దలు, నాయకులు కొక్కిరి అప్పన్న పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయి నుంచే ఉన్నత లక్ష్యాలు ఏర్పచుకోవాలి

భీమునిపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక స్థాయి నుంచే బాలికలు ఉన్నత లక్ష్యాలను నిర్ణయించుకుని క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసించాలని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుని కె.అరుణకుమారి పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో జరిగిన మహిళా దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ముందుగా దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు గంటా నూకరాజు, పిఆర్‌పి వర్మ,కనకల సన్యాసినాయుడు, మైలపల్లి లక్ష్మణరావు, తట్టికోట భీమారావు, గండిబోయిన పోలిరాజు, గ్రంథాలయాధికారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్‌లో స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు

సాగర్‌నగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఏపీఈపీడీసీఎల్ స్మార్ట్‌మీటర్లను సాగర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఏర్పాటు చేశారు. ముందుగా సాగర్‌నగర్‌లోని ఉన్న వివిధ వాణిజ్య సముదాయాలకు స్మార్ట్‌మీటల్లు అమర్చారు. వాణిజ్య సముదాయాల్లోని ఉన్న వారి ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్ ద్వారా ఇకపై బిల్లు వస్తుందని సంబంధిత ఏపీఈపీడీసీఎల్ అధికారులు తెలియజేశారు. తద్వారా ప్రతీ నెలా ఇకపై నేరుగా నమోదు చేసుకున్న సెల్‌ఫోన్ నెంబర్‌కు కరెంట్ బిల్లు వస్తుందని తెలిపారు. కచ్చితంగా ఏపీఈపీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

వైసీపీ శ్రేణులకు మాజీ మంత్రి ముత్తంశెట్టి సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి

భీమునిపట్నం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో నేతలు, కార్యకర్తలు ఉండాలని మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు వైసీపీ శ్రేణులకు సూచించారు. భీమిలి నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాలుగో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు బోని బంగారునాయుడు, నాయకులు ముత్తంశెట్టి మహేష్, సుంకరి గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీఅభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో అప్పలనాయుడు తదితరులు

భీమునిపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : భీమిలి యాతకుమ్మరిపాలెంలో మంగళవారం శ్రీఅభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. యాత కుమ్మరిపాలెం అభయాంజనేయస్వామి సేవా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీవీఎంసీ 2, 3 వార్డుల కార్పొరేటర్లు గాడు చిన్నికుమారి లక్ష్మి, గంటా అప్పలకొండ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, సీనియర్ నాయకులు గాడు అప్పలనాయుడు, గ్రామ పెద్దలు ఒనుము అప్పారావు, కండిపిల్లి పైడిరాజు, ఎర్ర శ్రీను, గొర్లె గోవింద తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ ప్రకటనపై సీపీఐ హర్షం

కొమ్మాది, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల పరిధిలో ఇళ్లు నిర్మించి ఇస్తామన్న కూటమి ప్రభుత్వ ప్రకటనను ఆహ్వానిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి మురిపిళ్ల పైడిరాజు పేర్కొన్నారు. మంగళవారం 5వ వార్డు పరిధి నగరంపాలెం నుంచి స్వతంత్రనగర్‌లో సచివాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం 68, 69 సచివాలయాల వెల్ఫేర్ కార్యదర్శులు గోపాలకృష్ణ, తరుణ్ లకు ఇంట పట్టాల కోసం సేకరించిన 186 వ్యక్తిగత దరఖాస్తులను అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ, నేతలు ఎండీ బేగం, ఎన్.త్రినాథ్, నగరంపాలెం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: కలెక్టర్ హరేంధిర ప్రసాద్



పాఠశాలలో మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఆనందపురం, నవంబరు (ఆంధ్రజ్యోతి) 19: టాయిలెట్ల వినియోగ ఆవశ్యకతను అందరూ తెలుసుకోవడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వరల్డ్ టాయిలెట్ల డేను పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ టాయిలెట్లను వినియోగించుకోవడంతో పాటు వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బహిరంగ మలవిసర్జన జిల్లాగా విశాఖను తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. అలాగే అందరూ తాగునీటిని పొదుపుగా వాడాలని, వృథా చేయరాదని కోరారు. జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీటి పైపు కనెక్షన్ ఇస్తామని పేర్కొన్నారు. విద్యార్థులందరూ భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు అధిరోహించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జూనియర్ కళాశాల నిర్మాణ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీవో శ్రీనివాసరావు, డీఈవో ప్రేమ్‌కుమార్, సర్పంచ్ చందక లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, ఎంపీడీవో డాక్టర్ జానకి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ పాఠశాలలో మొక్కలు నాటారు.

మరుగుదొడ్ల ఆవశ్యకతపై ర్యాలీ

పద్మనాభం-రూరల్: గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణం, వాటి ఆవశ్యకతపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో ఎం.విజయకుమార్ అన్నారు. పెంట గ్రామంలో సర్పంచ్ బి.పావని ఆధ్వర్యంలో చేతుల శుభ్రత, మరుగుదొడ్ల ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఇళ్లల్లో మరుగుదొడ్లను నిర్మించుకుని, బహిరంగ మలవిసర్జనను దూరంగా ఉండాలని కోరారు. అనంతరం పారిశుధ్య కార్మికుడు శివనారాయణను సత్కరించి నిత్యావసర సరకులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌వోపీఆర్‌డీ మీనాకుమారి, పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ఆవరణలో కర్ణాటకకు చెందిన ఉన్నతాధికారులు, తదితరులు

అప్పన్నను దర్శించుకున్న ఉన్నతాధికారులు

సింహాచలం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామిని కర్ణాటక రాష్ట్రానికి చెందిన పలువురు ఉన్నతాధికారులు మంగళవారం దర్శించుకున్నారు. వీరిలో కర్ణాటక రాష్ట్ర ముఖ్య కార్యదర్శి వెంకయ్య, ఐఏఎస్ అధికారి కృష్ణంరాజు, ఐఆర్ఎస్ అధికారి మహదేవ్, తదితరులు ఉన్నారు. అధికారులకు దేవాలయ సహాయ కార్యనిర్వహణాధికారి ఎన్.ఆనందకుమార్ ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకున్నాక అధికారుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనానంతరం పండితులు వేదాశీర్వచనాలు, అధికారులు శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు.

సచివాలయాలకు సీఎం, డిప్యూటీ సీఎంల చిత్రపటాలు



సచివాలయ సిబ్బందికి చిత్రపటాలను అందజేస్తున్న దృశ్యం

ఎండాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఎనిమిదో వార్డు పరిధి వరహగిరినగర్, వివేకానందనగర్ ప్రాంతాల్లోని సచివాలయాలకు సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల ఫొటోలను జనసేన పార్టీ వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్ మంగళవారం అందజేశారు. ప్రజలందరికీ కనిపించేలా వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గణేశ్, సత్యనారాయణ, రమేశ్ శివ, నాయుడు, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శంకరహర చతుర్థి పూజలు

మధురవాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి తర్వాత వచ్చిన చతుర్థిని పురస్కరించుకుని మంగళవారం ఏడో వార్డు పరిధి మానం ఆంజనేయనగర్‌లో ఉన్న లలితాత్రిపుర సుందరి సమేత మహాకామేశ్వరస్వామి వారి ఆలయంలోని శివుడికి పంచామృత, పండ్ల రసాలు, క్షీరాభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయ ధర్మకర్త బి.సురేశ్ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు.

వణికిస్తున్న జ్వరాలు

... 5వ పేజీ తరువాయి

చాలామంది జ్వర బాధితుల్లో బాడీ, జాయింట్ పెయిన్స్ తీవ్రమైన తలనొప్పి వంటి లక్షణాలు ఉంటున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు.

ఆస్పత్రులు చుట్టూ ప్రదక్షిణలు

నగర పరిధిలో జ్వరపీడితులు పెరుగుతున్నారు. ఇంట్లో ఎవరో ఒకరూ జ్వర లక్షణాలతో బాధపడుతూ కనిపిస్తున్నారు. కేజీహెచ్, విమ్స్‌తోపాటు అర్బన్ హెల్త్ సెంటర్స్, ప్రైవేటు ఆస్ప త్రులకు జ్వర లక్షణాలతో ప్రతిరోజూ వందలాది మంది వస్తున్నారు. కేజీహెచ్, విమ్స్‌లకు ప్రతిరోజూ 50 మందికి తగ్గకుండా వస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

అప్పన్న భూముల వ్యవహారంపై 22న విచారణ

... 5వ పేజీ తరువాయి

మాన్సాస్ ట్రస్టు ఈఓగా పనిచేసిన కోదూరి రామచంద్రమోహన్ అవినీతికి పాల్పడ్డారని, చట్ట వ్యతిరేకంగా వందలాది ఎకరాల భూముల వివరాలను రికార్డుల నుంచి తొలగించారని ఆరోపణలు అందడంతో 2019లో వైసీపీ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని నియమించింది. ఈ కమిటీ విచారణ జరిపి నివేదికను సమర్పించింది. కాగా దీనిపై విచారణకు హాజరుకావాలని కమిషనర్ ఆదేశించారు. విచారణలో పరిశీలించిన అంశాలు, వాస్తవాలు, నిజంగానే భూముల గోల్‌మాల్ జరిగిందా, అందుకు సంబంధించిన సాక్ష్యాలను సేకరించారా అనే అంశాలపై ఆరా తీస్తారని సమాచారం.

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి

సింహాచలం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారతదేశ చరిత్రలో తొలి మహిళా ప్రధానమంత్రిగా అత్యధిక కాలం ప్రజలకు సేవలందించిన దివంగత ఇందిరాగాంధీ సేవలు మరువలేనివని బెల్ హెచ్‌పీవీపీ కార్మిక నేత సూర్యనారాయణ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అడవివరం శాఖా గ్రంథాలయాధికారి ఎన్‌వీ నరసింహం ఆధ్వర్యంలో మంగళవారం లైబ్రరీలో ఇందిరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశానికి ఇందిరాగాంధీ చేసిన సేవలను వివరించారు. సత్యమూర్తి చారిటబుల్ ట్రస్టు ఆర్థిక సాయంతో సీనియర్ సిటిజన్లు సూర్యనారాయణ, గంగునాయుడు, తదితరులను సత్కరించారు.

24న బ్రాహ్మణ కార్తీక వన సమారాధన

సింహాచలం, నవంబరు 19: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 24న 98వ వార్డు పరిధిలోని వరాహలక్ష్మీనృసింహ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధనను నిర్వహిస్తున్నట్టు సంఘం ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణాపురం సమీపంలో కాశి రాధకు చెందిన తోటలో పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అందరూ హాజరు కావాల్సిందిగా కోరారు.

సదరం.. సమస్యలు అనేకం

... 5వ పేజీ తరువాయి

ఉండే నాయకులు... తమను పెన్షన్ గురించి ఎవరైనా అడిగితే వైజాగ్‌లో ఫలానా ఆస్పత్రికి వెళ్లి సర్టిఫికెట్ తెచ్చుకుంటే వెంటనే ఇప్పించేస్తా అని చెబుతుండడం మరో కారణంగా తెలుస్తోంది. ఆస్పత్రుల్లో వైద్యులు సదరు దివ్యాంగులతో మాట్లాడినప్పుడు ఇదే విషయాన్ని చెబుతున్నారు. దీంతో వైద్యులు, అక్కడున్న సిబ్బంది సదరం సర్టిఫికెట్లు అందించే ప్రక్రియను, స్లాట్ బుక్ చేసే విధానాన్ని తెలియజేసి వారిని వెనక్కి పంపిస్తున్నారు.

దళారులు దందా

అనేక ప్రాంతాల్లో దళారులు దివ్యాంగుల అమాయకత్వాన్ని క్యాష్ చేసుకుంటున్నారు. పెన్షన్ వచ్చేందుకు అవసరమైన సర్టిఫికెట్ మంజూరు చేయిస్తామని చెప్పి రూ.10 వేలు నుంచి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారు. నెలలు, రోజులు తరబడి తిప్పుతూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నార తప్ప పని చేయడం లేదు. ఇటువంటి దళారుల బాధితులు ఎంతోమంది వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు.

స్లాట్ డేట్ మర్చిపోయి..

ఆన్‌లైన్‌లో ఖాళీ బట్టి నెల నుంచి రెండు నెలలు వ్యవధిలో స్లాట్ దొరుకుతుంది. అయితే, ఎంతోమంది తమకు ఆన్‌లైన్‌లో ఇచ్చిన స్లాట్ తేదీలను మర్చిపోతున్నారు. ఆ తేదీలు ముగిసిన తరువాత ఆస్పత్రులకు వస్తున్నారు. స్లాట్ కేటాయించినప్పుడు రాకపోతే తాము చేసేదేమీ ఉండదని వైద్యులు చెబుతున్నారు. దీంతో వైద్యులతో కొందరు వాదనకు దిగుతుంటారు.

పెన్షన్ సర్టిఫికెట్ ఇస్తారంటే వచ్చేశాం

-రాయి సత్తిబాబు, మండపేట

షుగర్ వల్ల కాలికి ఇన్‌ఫెక్షన్ సోకింది. కరోనా సమయంలో కాళ్లు తీసేయాల్సి వచ్చింది. ఊర్లో ఉన్న వాళ్లు కేజీహెచ్‌కు వెళ్లి సర్టిఫికెట్ తెచ్చుకుంటే పెన్షన్‌కు పెడతామని చెప్పారు. దీంతో ఆదివారం బయలుదేరి వచ్చాం. రాత్రి ఒంటి గంట అయింది.

రైల్వే స్టేషన్‌లో పడుకుని ఉదయాన్నే కేజీహెచ్‌కు వచ్చాం. ఓపీ తీసుకుని డాక్టర్ దగ్గరకు వెళ్లేసరికి 11 గంటలు అయింది. తీరా డాక్టర్‌ను సర్టిఫికెట్ ఇవ్వమంటే కుదరదన్నారు. ఆన్‌లైన్‌లో సదరం స్లాట్ బుక్ చేసుకుని రావాలని చెప్పారు. ఊళ్లో ఎవరూ ఈ విషయాన్ని చెప్పలేదు. అనేక ఇబ్బందులు పడి ఇక్కడకు వచ్చినా ఉపయోగం లేకుండా పోయింది. ఆస్పత్రి అంతా ఇలా చిన్నపాటి బల్లల సాయంతో తిరిగాను. వీల్‌ఛైర్ అడిగితే డబ్బులు అడిగారు. డబ్బులు ఇచ్చే స్థోమత లేకపోవడంతో వీటి సాయంతోనే ఆస్పత్రి అంతా తిరిగాను.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు చెక్

... 5వ పేజీ తరువాయి

జోన్-6 (గాజువాక) ప్రాంతాల్లో యూజీడీ అందుబాటులోకి తేవడంతోపాటు కోర్‌సిటీ పరిధిలో ప్రస్తుతం ఉన్న యూజీడీ నెట్‌వర్క్‌ను పెంచేందుకు పనులు జరుగుతున్నాయన్నారు. నగరంలో ఇప్పటికే లక్ష వరకూ యూజీడీ కనెక్షన్లు ఉండగా 95 వేల కనెక్షన్లకు వేర్వేరు కారణాలతో లబ్ధిదారులు ముందుకురావడం లేదన్నారు. నగరంలో 24 చోట్ల మురుగునీరు నేరుగా సముద్రంలో కలుస్తోందని, వాటిలో 14 పాయింట్లను డిసెంబరు నాటికి సమీపంలోని ఎస్‌టీపీలకు మళ్లించే పని పూర్తవుతుందన్నారు.

శుద్ధిచేసిన నీటిని పరిశ్రమలకు విక్రయించడం ద్వారా ఏటా రూ.30 కోట్లు ఆదాయం సమకూరుతుందన్నారు. నగరంలో తాగునీరు కలుషితం కాకుండా ఉండేందుకు డ్రైనేజీలను క్రాస్ చేస్తున్న పైప్‌లైన్ పాయింట్లు 274 గుర్తించి వాటిని వేరే మార్గాల్లోకి మళ్లించామన్నారు. నీటి కాలుష్యం జరిగితే గుర్తించేందుకు వీలుగా ప్రతిరోజూ మూడుసార్లు నీటి శాంపిల్స్‌ను జీవీఎంసీ ల్యాబ్‌లో పరీక్షిస్తున్నామన్నారు. నగరమంతటికీ నిరంతరం నీరు సరఫరా చేయాలంటే రూ.1,200 కోట్లు అవసరమవుతుందన్నారు. జీవీఎంసీ పరిధిలో వీధి దీపాల పనితీరును మెరుగుపరిచే చర్యలు ప్రారంభమయ్యాయని, లైటింగ్ తక్కువగా ఉంటుందనే ఫిర్యాదులు అందుతున్నందున 50 వేల స్తంభాలకు 70 వాట్స్ లైట్లను ఏర్పాటుచేసి లైటింగ్ పెంచుతామన్నారు. జీవీఎంసీ పరిధిలో 600 ఎకరాల విస్తీర్ణంలో 1200 ఓపెన్‌స్పేస్‌లు ఉన్నాయని వాటిలో 400 ఓపెన్‌స్పేస్‌లకు ఇప్పటికే కంచెలు ఉండగా మిగిలిన వాటికి రెండు వరుసల్లో మొక్కలునాటడం ద్వారా గ్రీన్ ఫెన్సింగ్ ఏర్పాటుచేస్తామన్నారు. అలాగే కాపులుప్పాడలో 22 ఎకరాల్లో మొక్కలు నాటుతున్నామన్నారు. దీనివల్ల జీవీఎంసీలో ప్రస్తుతం 28 శాతం ఉన్న పచ్చదనం 33 శాతానికి పెరుగుతుందన్నారు. నగరంలో అనధికార భవనాలను గుర్తించేందుకు వీలుగా డ్రోన్‌ల ద్వారా సర్వే చేసే ప్రతిపాదన ఉందన్నారు. వంద గజాల్లోపు నిర్మాణాలకు ప్లాన్ అవసరం లేదని రాష్ట్రప్రభుత్వం ప్రకటించిందని, దీనివల్ల చాలావరకూ ఫిర్యాదులు తగ్గిపోతాయని ఆశాభావం వ్యక్తంచేశారు.

ఎయిర్‌పోర్టుకు 27వ ర్యాంకు

... 5వ పేజీ తరువాయి

9.9 శాతం ఉన్నప్పటికీ మిగిలిన విమానాశ్రయాల్లో ఈ పెరుగుదల ఇంకా అధికంగా ఉండటంతో విశాఖ స్థానం తగ్గిపోయింది. పొరుగునే ఉన్న ఒడిశా రాజధాని భువనేశ్వర్ విమానాశ్రయం 46,00,615 మంది ప్రయాణికులతో 14వ స్థానం దక్కించుకుంది. భువనేశ్వర్ విమానాశ్రయం నుంచి అంతకుముందు ఏడాది 36,24,905 మంది ప్రయాణించారు. వార్షిక వృద్ధి రేటు అక్కడ 26.9 శాతం నమోదైంది. విశాఖ కంటే 1.7 రెట్లు అధికం.

- విజయవాడ విమానాశ్రయం 2023-24లో 10,62,506 మంది ప్రయాణికులతో 45వ స్థానం, తిరుపతి విమానాశ్రయం 8,70,662 మందితో 46వ స్థానం దక్కించుకున్నాయి. అన్ని విమానాశ్రయాల్లో 2023-24లో ప్రయాణికుల సంఖ్య పెరగగా, తిరుపతిలో అంతకు ముందు ఏడాది కంటే తక్కువ నమోదుకావడం గమనార్హం. 2022-23లోనే తిరుపతి నుంచి 9,19,267 మంది ప్రయాణించారు. ఆ తరువాత ఏడాది వారి సంఖ్య 48,605 తగ్గిపోయింది.

ఉక్కు ఉద్యమ కార్యాచరణ

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటుచేయాలని నిర్ణయించామన్నారు. 24న పాతగాజువాక నుంచి కొత్తగాజువాక వరకూ భారీ ర్యాలీ, సమావేశం, 27న ఉత్తరాంధ్ర మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామన్నారు. ఇక 28వ తేదీ ఉదయం ఎనిమిది నుంచి మరుసటిరోజు సాయంత్రం ఆరు గంటల వరకు (34 గంటలు) కూర్మన్నపాలెంలోని శిబిరంలో దీక్ష చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా ఉద్యమ కార్యాచరణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, కేఎస్ఎన్ రావు, వరసాల శ్రీనివాసరావు, జె.రామకృష్ణ, కారు రమణ, యు.రామస్వామి, అప్పారావు, విళ్లా రామ్మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

గాడాంధకారంలో పిఠాపురం కాలనీ


కళాభారతి ఏరియాలో కమ్ముకున్న చీకటి


లైట్లు వెలగక ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

- 22వ వార్డులో వెలగని వీధి దీపాలు
- ఇటీవల దుకాణాలు తొలగించడంతో కానరాని అలికిడి
- వాహనదారులు, పాదచారుల ఇక్కట్లు
- చోరుల స్వైరవిహారం
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

మద్దిలపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డులో వీధి దీపాలకు గ్రహణం పట్టుకుంది. రాత్రయితే వీధులన్నీ అంధకారంలో మగ్గుతున్నాయి. వీధి లైట్లు వెలగకపోవడంతో తరచుగా వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. కానీ ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. శివాజీపాలెం పరిధిలోని పిఠాపురం కాలనీ, కళాభారతి ఏరియా, పీతలవానిపాలెం, బలరాంనగర్, మంగాపురం కాలనీ, రాజీవ్‌నగర్, తారా మసీదు ఏరియాల్లో వీధి దీపాలు పాడయ్యాయి. దీంతో చీకటి పడితే ఆయా ఏరియాల్లో అంధకారం అలుముకుంటోంది. రాత్రిళ్లు ఇళ్లకు వెళ్లే వాహనదారులు, పాదచారులు చీకటిలో బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తోంది. గతంలో వార్డులోని అన్నీ ప్రాంతాల్లో వీధి దీపాలు అమర్చారు. కొద్ది నెలలు పనిచేసిన తర్వాత ఒక్కొక్కటిగా మరమ్మతుకు గురయ్యాయి. నెలలు గడుస్తున్నా కొత్త వీధి దీపాలు వేయకపోవడంతో చీకట్లు కమ్ముకుంటున్నాయి.

వీధి దీపాలు వెలగకపోవడంతో శివాజీపాలెంలో రాత్రిళ్లు దొంగతనాల బెడద ఎక్కువైంది. ఇళ్ల ముందు పార్కింగ్ చేస్తున్న బైక్‌లు, పెట్రోల్, నివాసాల కిటికీల పక్కన పెట్టే వస్తువులను చోరీ చేస్తున్నారు. వీధులు చీకట్లో ఉన్నందున రోడ్డులపై ఎవరు తిరుగుతున్నారో స్థానికులు గుర్తించలేకపోతున్నారు. కళాభారతి పార్కు వద్ద గాడాంధకారం ఉండడంతో అక్కడ ఆకతాయిలు గంజాయికి అడ్డాగా చేసుకున్నారు. ప్రతీ రోజు సాయంత్రం అయితే చాలు అక్కడకు పదుల సంఖ్యలో చేరి గంజాయి, మద్యం సేవిస్తున్నారు. మద్యం మత్తులో దొంగనాలకు పాల్పడుతున్నారు. బాధితులు పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండాపోయింది.

నిర్మానుష్యంగా రోడ్డులు..

వార్డులోని దుకాణాలు తొలగించడంతో రోడ్డులన్నీ నిర్మానుష్యంగా మారాయి. మొన్నటి వరకు రోడ్డులపై ఫాస్ట్‌ఫుడ్, తోపుడు బండ్ల వ్యాపారాలతో రోడ్డుల్లో కొంత అలికిడి ఉండేది. అంతేకాకుండా దుకాణాల లైట్ల వెలుగుతో రోడ్డు కూడా కనిపించేది. ఇటీవల దుకాణాలన్నీ తొలగించడంతో వీధులన్నీ నిర్మానుష్యంగా తయారయ్యాయి. బస్సు, ఆటో సర్వీస్‌లు ఏవీ కళాభారతి రోడ్డులో ఉండవు. కేవలం ఈ ప్రాంతవాసులు మాత్రమే ఈ రోడ్డులో ఇళ్లకు చేరుకుంటారు. అందుకే దుకాణాలు తీసేశాక జనాలు లేక రోడ్డు చీకటిమయంగా మారిపోయాయి. అధికారులు స్పందించి వెంటనే ఆయా ప్రాంతాల్లో విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దుకాణాలు తీయించి దారుణానికి ఒడిగట్టారు

- కార్పొరేటర్‌ను చుట్టిముట్టిన వీధి వ్యాపారులు
- సమాధానం చెప్పలేక నీళ్లు నమిలిన మూర్తి యాదవ్


కార్పొరేటర్ పీతల మూర్తిని చుట్టుముట్టిన నిలదీస్తున్న వీధి వ్యాపారులు

మద్దిలపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ సొంత వార్డులో తీవ్ర వ్యతిరేకతను చవిచూశారు. హైకోర్టులో కేసు వేసి వీధి దుకాణాలు తొలగించడంపై వ్యాపారస్తుల నుంచి నిరసన ఎదుర్కొన్నారు. మంగళవారం ఉదయం వార్డు సచివాలయం సమీపంలో ఆ సిబ్బందితో మాట్లాడుతుండగా ఆయనకు చేదు అనుభవం ఎదురైంది. వార్డుకు చెందిన వీధి వ్యాపారులు మూర్తియాదవ్‌ను నిలదీయడమే కాకుండా ముందుకు కదలనీయకుండా చుట్టుముట్టారు. ముప్పై ఏళ్లుగా నిర్వహించుకుంటున్న వ్యాపారాలను ఎందుకు నాశనం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చిల్లర వ్యాపారాలు చేసుకుని కుటుంబాలు పోషించుకుంటున్న తాము ఇప్పుడు బతికేదెలా అంటూ ప్రశ్నించారు. 'జీవీఎంసీ ఎన్నికల్లో మీ గెలుపు కోసమే వీధి వీధిన జెండాలు మోసాం, దానికి ఇదా ప్రతిఫలం' అంటూ నిష్ఠూరమాడారు. 'మీరు కార్పొరేటర్ అయితే మాకు అండగా ఉంటారని భావిస్తే మా పొట్ట ఎందుకు కొట్టారు' అంటూ ప్రశ్నించారు. వ్యాపారాలు కోల్పోయి రోడ్డున పడ్డా బాధితులు ఆగ్రహంతో సంధించిన ప్రశ్నలకు ఏం సమాధానం చెప్పాలో తెలియక మూర్తియాదవ్ నీళ్లనమిలారు.

'దుకాణాలు తీయడం తప్పే జీవీఎంసీ అధికారులకు అడగండి' అంటూ పొంతని లేని సమాధానాలు చెప్పి అక్కడ నుంచి జారుకున్నారు.


ఆదర్శ నగర్ కూడలి వద్ద ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్

ఆదర్శనగర్ కూడలిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ చర్యలు

- ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్

ఆరిలోవ, నవంబరు 19 : (ఆంధ్రజ్యోతి) : ఆదర్శనగర్ కూడలిలో ట్రాపిక్ సమస్య పరిష్కరించే క్రమంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని, దీనిపై పోలీసు కమిషనర్‌తో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఏడీసీపీ కె.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన ఆదర్శనగర్ కూడలి ప్రాంతాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నిత్యం అధికంగా వాహనాల రాకపోకలు ఉండడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని అన్నారు. ప్రధానంగా ఆదర్శనగర్ వైపు వెళ్లే వాహనాలు ఎక్కువగా ఉండడం, ఈ కూడలిలో రోడ్డు సన్నగా ఉండడంతో సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. అలాగే రోడ్డు పక్కన ఉన్న దుకాణాలు కూడా సమసమస్యకు ఒక కారణమని అన్నారు. ఏడీసీపీ వెంట సీఐ ప్రసాద్, ఎస్ఐ, సిబ్బంది ఉన్నారు.

ఇక్కడ ట్రాఫిక్ సమస్యపై స్థానిక టీడీపీ నేత సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు పోలీసుఅధికారులు స్పందించారు.

అవయవ దానంపై అవగాహన ఉండాలి

- కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్


రామారావు మృతదేహానికి పూలమాల వేస్తున్న హరేంధిర ప్రసాద్

ఆరిలోవ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అవయవ దానం పట్ల ప్రజలందరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ కోరారు. ఈ నెల 17న దువ్వాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వాసిరెడ్డి రామారావు (57) అనే వ్యక్తి సోమవారం బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు ప్రకటించడంతో ఆయన అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఈ నేపథ్యంలో రామారావు మృతదేహానికి మంగళవారం కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అవయవ దానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులను అభినందించి, రాష్ట్ర ప్రభుత్వం తరపున పది వేలను అందజేశారు. ఈ సందర్భంగా షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ అవయవదానం ద్వారా నలుగురి జీవితాల్లో వెలుగులు నింపవచ్చన్నారు. రాష్ట్రంలో సుమారు నాలుగు వేల మంది వివిధ అవయవాల కోసం ఎదురుచూస్తున్నారని, అందువల్ల ఆప్తులను కోల్పోయినప్పుడు సంబంధిత కుటుంబ సభ్యులు ధైర్యం తెచ్చుకుని మృతుని అవయవాలను దానం చేసి నలుగురి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు.

కార్యక్రమంలో జీవన్‌దాన్ రాష్ట్రకో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు, పలువురు వైద్యులు పాల్గొన్నారు. కాగా రామారావు నుంచి సేకరించిన ఊపిరితిత్తులు, గుండె, కిడ్నీ అవయవాలను గ్రీన్ చానల్ ద్వారా వివిధ ప్రాంతాలకు తరలించినట్టు ట్రస్టు సభ్యులు పేర్కొన్నారు.

గ్రంథాలయంలో ఇందిరమ్మ జయంతి


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని నగర శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 108వ జయంతి నిర్వహించారు. గ్రంథాలయాధికారి కేవీఏ ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు సత్యశ్రీ, పద్మ, సచివాలయం వైద్య విభాగం కార్యదర్శి సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యస్వామి పూజలు


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వెంకోజీపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం మంగళవారంపురస్కరించుకుని కొత్త వెంకోజీపాలెంలోని జ్ఞానానంద ఆశ్రమం శ్రీగౌరీజ్ఞానలింగేశ్వరాలయ దేవస్థానంలో వేంచేసి ఉన్న నాగదేవత, శివుడు సమేతంగా ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలనునిర్వహించారు. తెల్లవారు జాము నుంచి ఆలయానికి చేరుకుని విశేష అభిషేకాలు నిర్వహించారు. పాలు, పెరుగు, తేనే, నెయ్యి, పంచదార. పసుపు, కుంకుమ, విభూది, పుష్పాలు, రోజ్‌వాలు తదితర వాటితో స్వామి వారిని భక్తులు స్వయంగా అభిషేకం జరిపారు. భక్తులతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. కార్యక్రమంలో అర్చకులు అరవెల్లి సూర్యప్రకాష్‌శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాలబాస్కరశర్మ భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు నిర్వహించి, తీర్థప్రసాదాలను అందజేశారు. గ్రామ సేవా సంఘం సభ్యులు, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

క్రీడల్లో గురుకులం విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రత్నవల్లి, ఉపాధ్యాయులు

ఆరిలోవ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు జిల్లా కొప్పెర్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన జోనల్ స్థాయి స్పోర్ట్స్‌మీట్‌లో తమ పాఠశాల విద్యార్థులు పలు క్రీడాంశాల్లో పతకాలు సాధించినట్టు అంబేడ్కర్ గురుకులం (విశాఖపట్నం) ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. ఏపీ సాంఘిక సంక్షేమ గురుకులం విద్యార్థులు జోన్-1లో గల శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు.

జూనియర్ విభాగంలో చెస్, క్యారమ్స్ పోటీల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకొని ట్రోఫీ సాధించారు. పరుగు పందెం, ట్రాక్ అండ్ ఫీల్డ్, షాట్‌పుట్, త్రోబాల్, జావెలిన్‌తో పతకాలు సాధించారు.

సీనియర్స్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి సీహెచ్ అభినయ షార్ట్‌పుట్‌లో గోల్డ్ మెడల్, డిస్క్ త్రోబాల్‌లో గోల్డ్ మెడల్, జావలిన్‌త్రోలో సిల్వర్ మెడల్ సాధించాడు. అలాగే 1500 మీటర్ల పరుగు పందెంలో డి.దీక్షిత్‌చరణ్ తేజ ద్వితీయ స్థానం, ఆర్.శివకుమార్ తృతీయ స్థానం సాధించారు.

జూనియర్స్ విభాగం చెస్‌లో ఆదిత్య యశ్వంత్ ద్వితీయ స్థానం, క్యారమ్స్‌లో కేవీఎల్ నారాయణ, ఆర్.సందీప్ చెస్‌లో ట్రోఫీలను కైవసం చేసుకున్నారు. పరుగులో సీహెచ్ అభి వ్యక్తిగత చాంపియన్ షిప్‌ని కైవసం చేసుకున్నాడు.

ఈ సందర్భంగా క్రీడలలో ప్రతిభలను కనబరిచిన విద్యార్థులను గురుకులాల విశాఖ, అనకాపల్లి జిల్లాల సమన్వయకర్త ఎస్.రూపవతి, ప్రిన్సిపాల్ రత్నవల్లి, వైస్ ప్రిన్సిపాల్ టీకే రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులకు మంచి తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎ.సత్యసుధాకర్, పీఈటీ జె.వివేకానందను ప్రశంసించారు.

'చెత్త సమస్య'ను పట్టించుకోరే!

- ఏడో సెక్టర్‌లో చెత్త తరలింపుపై నిర్లక్ష్యం


ఏడో సెక్టరు ప్రధాన రహదారిని ఆనుకుని మినీ డంపింగ్ యార్డు తలపిస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. నెలల తరబడి ఎక్కడికక్కడే చెత్తాచెదారం కళ్లెదుటే కనిపిస్తున్నా పారిశుధ్య సిబ్బంది తొలగింపునకు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గ్రేటర్ విశాఖ 18వ వార్డు పరిధిలోని ఎంవీపీ కాలనీ ఏడో సెక్టరులో ప్రధాన రహదారిని ఆనుకుని ఓ ప్రదేశం మినీ డంపింగ్ యార్డులా మారింది. ఎక్కడి చెత్తను తీసుకొచ్చి, పరిసర ప్రాంతవాసులు పోసేస్తుండడంతో గుట్ట తయారైంది. ఓ పక్క బ్యాంకు ఉన్న భవనం, మరో పక్క గోడ, మధ్యలో కొద్ది ప్రదేశం.. ఎవరికీ ఇబ్బంది లేకపోవడంతో అదే డంపింగ్ యార్డులా వినియోగించేస్తున్నారు. దీన్ని పారిశుధ్య సిబ్బంది తొలగించకపోవడంతో చెత్తాచెదారం గుట్టలా పేరుకుపోయింది. వర్షానికి చెత్త తడిచిపోయి, దుర్గంధం వ్యాపిస్తోంది. మరో పక్క విపరీతంగా దోమలు వృద్ధి చెందడంతో ఇబ్బందిగా మారుతోంది. ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ చెత్తాచెదారం గుట్ట రోజురోజుకూ పెరుగుతోంది. జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు ఇప్పటికైనా స్పందించి, చెత్తను తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే ఇక్కడ చెత్త వేయకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచిస్తున్నారు.

ఇందిరాగాంధీ నిర్ణయాలు సాహసోపేతం, స్ఫూర్తిదాయకం


ఇందిరా గాంధీకి నివాళులు అర్పిస్తున్న ఐఏఎస్‌ఈ ప్రిన్సిపాల్ నాగరాజకుమారి, విద్యార్థులు

వెంకోజీపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : భారత దేశంలో అతి పిన్న వయస్సులోనే తొలి మహిళా ప్రధానిగా ఇందిరా గాంధీ బాధ్యతలు చేపట్టడం మహిళా లోకానికి గర్వకారణమని, అటువంటి ఆమె స్ఫూర్తితో నేటి మహిళలంతా ముందుకు సాగాలని ఏయూ ఐఏఎస్‌ఈ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాగరాజకుమారి సూచించారు. మంగళవారం ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఐఏఎస్‌ఈ అండ్ ఇగ్నో కేంద్రం సంయుక్తంగా సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజ కుమారి మాట్లాడుతూ ఇందిరా గాంధీ బ్యాంకులు జాతీయం చేశారని, గరీబీ హటావో అనే నినాదంతో దేశ ప్రజలని ఉత్తేజపరిచారని, 1971 'భారతరత్న' పురస్కారాన్ని పొందిన మొట్టమొదటి మహిళా కూడా అని కొనియాడారు.

అలాగే విద్యార్థులు, నవ్య, దీపక్, పాల్, సురేష్, వారి మాటలో ఇందిరా గాంధీ దేశానికి చేసిన మంచి పనులు, సాధించిన ఘనతలు, అన్ని రంగాల్లో ఆమె చేసిన కృషిని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ పుష్ప, డాక్టర్ సోనీ హవిల, డాక్టర్ తిరుమలాంబ, డాక్టర్ విద్యావతి, డాక్టర్ శ్రీదేవి, పీడీ లక్ష్మయ్య పాల్గొన్నారు.

రూ.16 లక్షలతో ప్రహరీ నిర్మాణం


నిర్మాణంలో ఉన్న ప్రహరీ

ఎంవీపీ కాలనీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ నాలుగో సెక్టరులోని ప్రశాంతి పార్కు చుట్టూ ప్రహరీ నిర్మాణం చురుగ్గా సాగుతోంది. రూ. 16 లక్షల జీవీఎంసీ నిధులతో దీనిని నిర్మిస్తున్నారు. గతంలో ఉన్న నిర్మాణం పూర్తిగా పాడైపోవడంతో నూతనంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పార్కు నిరాదరణకు గురైంది. ఈ ప్రాంతీయులకు చాలా అవసరమే అయినప్పటికీ కొన్నాళ్లుగా నిర్వహణ కొరవడటంతో ప్రస్తుతం ప్రహరీ నిర్మిస్తున్నట్లు జీవీఎంసీ ఏఈ అప్పలనాయుడు తెలిపారు. త్వరలోనే లోపల కూడా పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్టు తెలిపారు.

ఘనంగా నేషనల్ ఎంటర్‌ప్రెన్యూయనర్స్ డే వేడుకలు


కోటేశ్వరరావుకు సన్మానిస్తున్న ఆచార్యులు

వెంకోజీపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఏయూ మహిళా ఇంజనీరింగ్‌కళాశాలలో నేషనల్ ఎంటర్‌పెన్యూనర్స్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జోర డ్రోన్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ సీఈవో సాగర్ కోటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 'డ్రోన్స్ రంగంలో ఎంటర్‌పెన్యూనర్‌గా ఎదగడం, విజయం సాధించడం' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్ష కలిగిన వారికి స్ఫూర్తిని అందించే విధంగా ఈ ప్రసంగం సాగింది. డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి వాల్యూమెట్రిక్ అనాలసిస్ చేసే విధానాన్ని ఆయన తెలియజేశారు ప్రణాళిక, డేటా సంపాదించడం డేటా ప్రాసెస్ చేయడం, ప్రాజెక్టు పూర్తి చేయడం అనే దశలను విద్యార్థులకు తెలియజేశారు.

ఈ సందర్భంగా తాను నిర్వహించిన పలు ప్రాజెక్టులను విద్యార్థులతో పంచుకున్నారు. అలాగే ఆ హబ్ అందిస్తున్న ప్రోత్సాహం, ఇటీవల సాధించిన విజయవాలను విద్యార్థులకు వివరించారు.

ఈ సందర్భంగా సాగర్ కోటేశ్వరరావును కళాశాల తరపున సత్కరించారు. డ్రోన్ వ్యవస్థకు సాగర్ అందిస్తున్న సేవలు, కృషిని ప్రిన్సిపల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.పద్మశ్రీ, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య బి.ప్రజ్ఞ, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎస్.అరుణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞానం పంచిన ప్రదర్శన


నమూనాలతో సత్యసాయి విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : 'సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్, తగ్గింపు, పునర్వినియోగం, రీ-సైకిల్' అంశంపై ఎంవీపీ కాలనీలోని సత్యసాయి విద్యా విహార్‌లో మంగళవారం విద్యార్థుల ప్రదర్శన విజ్ఞానం పంచింది. నాలుగు, అయిదు తరగతుల విద్యార్థులు ప్రదర్శనలో వివిధ నమూనాలు ప్రదర్శించారు. ప్రణాళిక, పరిశోధన, సృజనాత్మకతతో సౌర ఫలకాలు, వర్షపునీటి సంరక్షణ, పర్యావరణ అనుకూల గృహాలు, సోక్ పిట్ వంటి నమూనాలు విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికితీశాయి. విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు.

సీపీఐ సభను విజయవంతం చేయాలి

మద్దిలపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 24న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరగనున్న బహిరంగ సభను ప్రజలంతా విజయవంతం చేయవలసిందిగా ఏఐటీయూసీ కార్యవర్గ సభ్యుడు కాడ్రేంగుల సత్యాంజనేయ కోరారు. 63వ వార్డు పరిధి కాకరలోవ భగత్‌సింగ్ కూడలిలో మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన వాల్ పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయాని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాంబాబు,కనకేశ్వరరావు, త్రినాథ్, వెంకట్‌పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

ఈవీఎం గోదాములు తనిఖీ చేసిన కలెక్టర్


విజిటర్స్ బుక్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

ఆరిలోవ, నవంబరు 19 : (ఆంధ్రజ్యోతి) : చినగదిలి రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో గల ఈవీఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. నెల వారీ తనిఖీల్లో భాగంగా మంగళవారం ఉదయం సిబ్బందితో వెళ్లి గోదాములను సందర్శించారు. అక్కడి పరిస్థితులను గమనించారు. సీసీ కెమెరాల పని తీరు, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అక్కడ ఉన్న సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందించారు. అక్కడ ఉన్న విజిటింగ్ రిజస్టర్‌లో ఆయన సంతకం చేశారు. ఆయన వెంట ఎన్నికల సెల్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నీరు, పారిశుధ్య నిర్వహణపై శిక్షణ


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, పాల్గొన్న టీవోటీ సభ్యులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత వంటి అంశాలపై డీఆర్‌డీఏ కార్యాలయంలో మంగళవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు డైరక్టర్ బి.లక్ష్మీపతి ఆధ్వర్యంలో యూనిసెఫ్, సెర్ప్ సమన్వయంతో టీవోటీ సభ్యులకు గ్రామాల్లో పారిశుధ్యం, రక్షిత మంచినీరు నిర్వహణ, మరుగుదొడ్లు, చెత్త, వ్యర్థాల నిర్వహణ, వ్యక్తిగత అలవాట్లపై మండల స్థాయిలో వీవోఏలు, వీవోటీలు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలు, సాధించిన ప్రగతి, జీవనోపాధి పథకాల అమలు వంటివాటిపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ పుల్లయ్య, డీపీఎంలు, ఏపీఎంలు, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కంగువా :** సంగం, జగదాంబ, మెలోడీ, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **మట్కా :** శరత్, శారద, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో:** లలిత (శ్రీహరిపురం)
- **క :** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా)సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :**రమాదేవి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 28, వంకాయలు (తెలుపు)32, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 18, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 30, క్యారెట్ 64 దొండకాయలు 32, బంగాళ దుంపలు 40, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది)50, బరబాటి 30, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 36, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 55, పొటల్స్ 52, కీరదోస 24, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడ దుంపలు 32, కంద 66, దేముదు చిక్కుడు 82, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్యాప్సికం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	95
ఫారం ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

మూలకు చేరిన గుడ్డ సంచుల యంత్రం


నరసింహనగర్ రైతుబజారులో యంత్రం

అక్కయ్యపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 46వ వార్డు నరసింహ నగర్ రైతుబజారులోని గుడ్డ సంచుల యంత్రం మూలకు చేరింది. వినియోగదారులు గుడ్డ సంచులు తీసుకుందామనుకున్నా అది పని చేయకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఈ యంత్రంలో రూ.10 నోటు గానీ, రూ.5 నాణేలు గాని రెండు వేస్తే సంచి వచ్చేది. ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని తగ్గించేందుకు ఈ యంత్రాన్ని గతంలో కాలుష్య నియంత్రణ మండలి రైతుబజారులో ఏర్పాటు చేసింది. దానిలో కొన్ని నెలలు గుడ్డ సంచులను పెట్టారు. ఆ తర్వాత దాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఆ యంత్రం మూలన పడడంతో సంచులు కొనుగోలు చేయడానికి వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఈ యంత్రాన్ని బాగుచేయించి ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించేందుకు దోహదపడాలని పలువురు కోరుతున్నారు.

ఆర్టీఐ ఆర్గనైజర్‌గా ఆల్ఫాకృష్ణ



డాబాగార్డెన్స్ నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి): సమాచార చట్టం అఖిల భారత మానవ హక్కుల సంఘానికి (హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్ అసోసియేషన్ ఆలిండియా) ప్రధాన ఆర్గనైజర్‌గా మూడేళ్ల కాలానికి తనను నియమించినట్లు సన్నికృష్ణ రాజయ్య బయగాని (ఆల్ఫాకృష్ణ) తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ బోర్డు కమిటీ వ్యవస్థాపక సీతంశెట్టి కామేష్ గాడి నియామక పత్రం పంపారన్నారు. రాజ్యాంగ హక్కులకు సాధికారత, మానవ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ముందుకెళ్తానన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విజేతలను అభినందిస్తున్న వాసు ప్రకాష్

సీతమ్మధార, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత్ వికాస్ పరిషత్ నిర్వహించిన క్విజ్ పోటీల్లో తమ విద్యార్థులు ఎన్.ఇసాంత్ కార్తికేయ, జె.శ్రవణ్‌లు ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకుని జనవరి 19న లక్నోలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని శ్రీప్రకాష్ విద్యాసంస్థ వెల్లడించింది. ఏపీ నుంచి ఎంపికైన ఏకైక బృందంగా తెలిపింది. ఈ నెల 17న గుంటూరులో జరిగిన క్విజ్ పోటీ దక్షిణ క్షేత్ర స్థాయిలో నిర్వహించారని పేర్కొంది. ఎంపికైన తమ విద్యార్థులకు గుంటూరు మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారని తెలిపింది. వీరిని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ డైరెక్టర్ చిట్టూరి వాసు ప్రకాష్ అభినందించారు.

ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులు

కంచరపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులని జీవీఎంసీ రామ్మూర్తిపంతులపేట స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆర్పీపేట ఉన్నత పాఠశాల్లో మంగళవారం ప్రారంభమైన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం పుస్తకాలతో కుస్తీ పడుతూ నూతన విషయాలు తెలుసుకుంటూ ఉపాధ్యాయులు బోధన సాగించాలన్నారు. మారుతున్న సాంకేతిక, ప్రపంచీకరణ నేపథ్యంలో తదనుగుణంగా ఉపాధ్యాయులు ఉత్సాహంగా పుస్తక పఠనం చేస్తుండాలన్నారు. అనంతరం శిక్షణ కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. ఆర్పీలు పి.వెంకటేశ్వర్రావు, పి.చంద్రశేఖర్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

హమ్మయ్య...మళ్లీ చెలామణిలోకి రూ.పది నాణెం


చెల్లుబాటులోకి వచ్చిన పది నాణెం

జగదాంబ కూడలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పది నాణెం విడుదలయ్యే కొత్తలో అపురూపంగా కొందరు దాచుకునేవారు. క్రమంగా దాని చెలామణి పెరగడంతో రూ.పది నోటు 'పనైపోయినట్లే'నని భావించారు. ఆ తరువాత ఏమైందో.. ఏమో..! పది నాణెం చేతికివ్వగానే 'మాకు వద్దం'టూ ఛీదరించుకునేవారి సంఖ్య పెరిగింది. నిత్యావసరాలు, కాయగూరల మార్కెట్‌లో ఎక్కువగా అవసరమయ్యే రూ.10లను చెల్లని నాణెం అంటూ ప్రచారంలోకి తెచ్చారు. నాణెం చెలుబాటు అవుతుందని కొందరు తీసుకున్నా.. వారి నుంచి ఇతరులు తీసుకోవడానికి అంగీకరించకపోవడంతో విద్యావంతులు సైతం వద్దంటూ నాణేన్ని దూరంగా పెట్టారు. గత కొన్నేళ్లుగా ఈ నాణెం పూర్తి బహిష్కరణకు గురయ్యింది. ఎవరికి వారు దీన్ని చెల్లని నాణెంగా మార్చేశారు. నగరంలోని ప్రధాన మార్కెట్లు, వ్యాపార కూడళ్లు, బడా షాపింగ్ మాల్స్‌లో పది నాణెం చేతికిస్తే సున్నితంగా తిరస్కరించే పరిస్థితి నెలకొంది. రిజర్వు బ్యాంకు ఎటువంటి ఆంక్షలు పెట్టక పోయినా ఈ నాణేన్ని అకారణంగా వెలేశారు. దీంతో చెలామణిలోకి వచ్చిన నాణేలు బ్యాంకుల ద్వారా తిరిగి రిజర్వు బ్యాంకుకు చేరి గుట్టలుగా పేరుకు పోయాయి.. రిజర్వుబాంకు అధికారులు పలు ప్రకటనలు, హెచ్చరికలు చేసినా తొలుత జనంలో మార్పు రాలేదు. అయితే కొద్ది కాలంగా రూ.10 నోటు చెలామణి తగ్గిపోవడం, లావాదేవీలకు ఇబ్బందులు ఎదురవ్వడంతో వ్యాపార కూడళ్ళు, చిరువ్యాపారులు, తినుబండారాల అమ్మకందార్లు పది రూపాయిల నాణెంపై ఉన్న ఆంక్షలను పక్కన పెట్టేశారు. ఇటీవల యూనియన్ బ్యాంకు ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అవగాహన శిబిరం ఏర్పాటు చేసి పది నాణెం చెలామణిపై అపోహలు వద్దని వివరణ ఇవ్వడంతో నగరంలో అజ్ఞాతవాసం వీడిన పది నాణెం మళ్లీ జనం జేబులో గలగలలాడుతోంది. అన్ని వర్గాల వారు తీసుకుంటూ హమ్మయ్య...అని ఊపిరి పీల్చుకుంటున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టదా?


అంబేద్కర్ సర్కిల్ వద్ద గోతుల రహదారి

డాబాగార్డెన్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 31వ వార్డు డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం సర్కిల్ నుంచి కృష్ణాగార్డెన్స్‌కు వెళ్లే రహదారిలోనూ, సర్కిల్ నుంచి ఎల్ఐసీ కూడలి వెనుక రోడ్డువైపు వెళ్లే రహదారిలో కొద్ది రోజులుగా ప్రమాదాలు జరుగుతున్నా అధికారులకు చలనం లేకుండాపోతోంది. జ్యూపిటర్ హోండా షారూం వద్ద గోతులతో పాటు పెద్ద గొయ్యి పడింది. వాహనదారులు అక్కడకొచ్చే సమయంలో ఒక్కసారిగా బ్రేకు వేయాల్సి రావడంతో ప్రమాదాలకు గురవుతున్నారు.కొందరు ద్విచక్రవాహనదారులు గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ముఖ్యమైన సర్కిల్‌లో మరమ్మతులు చేపట్టకపోవడంతో సమస్య ఇబ్బందికరంగా తయారైంది. అధికారులు తక్షణమే తారురోడ్డు మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

వెయిట్ లిఫ్టింగ్ విజేతకు అభినందనలు


తేజశ్రీని అభినందిస్తున్న దృశ్యం

సీతమ్మధార, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల వెయిట్ లిఫ్టింగ్ అండర్-19 బాలురు, బాలికల ఛాంపియన్ షిప్ పోటీలను గుడివాడలోని ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. డాక్టర్ లంకపల్లి జూనియర్ కళాశాలకు చెందిన ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని పి.తేజశ్రీ 45 కిలోల విభాగంలో రజత పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా తేజశ్రీని కళాశాల కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.సోమేశ్వరరెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీఎస్‌కే చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, పీడీ డాక్టర్ బీఆర్ఎస్ లక్ష్మణరెడ్డి, మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వ విధానాలపై 26న నిరసన


సమావేశంలో మాట్లాడుతున్న కె.లోకనాథం

జగదాంబ కూడలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న చేపడుతున్న దేశవ్యాప్త నిరసనలో కార్మికులు, కర్షకులు భాగస్వాములు కావాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.లోకనాథం పిలుపునిచ్చారు. సిటు కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలతో అణచివేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలోని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం కేంద్రానికి తొత్తుగా మారడం వల్లనే హక్కులకు భంగం వాటిల్లుతోందని దుయ్యబట్టారు. విశాఖ ఉక్కును కాపాడుతామంటూ ఎన్నికల ముందు హామీలిచ్చిన టీడీపీ, జనసేన నాయకులు కాంట్రాక్టు కార్మికులను అక్రమంగా తొలగించినా మౌనం వహించడం దుర్మార్గమన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముందస్తుగా ఈ నెల 24న ఉదయం 10 గంటలకు పాత గాజువాక జంక్షన్ నుంచి, విశాఖ డీఆర్ఎం కార్యాలయం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు చేపట్టనున్న ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిటు నాయకులు కుమార్, సీపీఎం నాయకుడు గంగారావు, బొట్టా ఈశ్వరమ్మ, జిల్లా అధ్యక్షుడు కె.ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడు శవమై తేలాడు


మృతుడు మనోజ్ ప్రీతమ్ (ఫైల్‌ఫొటో)

గోపాలపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన ఓ యువకుడు మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో శవమై తేలాడు. పురుషోత్తపురం ప్రాంతానికి చెందిన సబ్బిటి మనోజ్ ప్రీతమ్ (19) ఐటీఐ పూర్తి చేశాక ఖాళీగా ఉంటున్నాడు. అయితే ఈ నెల 17వ తేదీ రాత్రి మనోజ్ ఇంటి నుంచి బయటకు వెళ్లి మళ్లీ రాలేదు. అయితే తన మిత్రుల వద్ద ఉండి ఉంటాడని కుటుంబీకులు భావించారు. సోమవారం సాయంత్రం వరకు కూడా మనోజ్ ఇంటికి రాకపోవడంతో అదే రోజు రాత్రి తల్లి సునీత పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు యువకుడు అదృశ్యమైనట్టు కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో గుర్తించిన జలాశయ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. వారు మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా మనోజ్ ప్రీతమ్‌గా పోలీసులు గుర్తించి ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాగా మనోజ్ తన మిత్రుల వద్ద కొంత సొమ్ము అప్పుగా తీసుకున్నాడని, దానిని తిరిగి చెల్లించాలని మిత్రులు ఒత్తిడి చేయడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలినట్టు సమాచారం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కార్తీక మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మంగళవారం మురళీనగర్ రామాలయంలో ఉమా రామలింగేశ్వర స్వామికి రుద్రాక్షలతో అలంకరణ

'సెవెన్ హిల్స్ కార్మికుల అక్రమ తొలగింపులు ఆపాలి'

అక్కయ్యపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం సెవెన్‌హిల్స్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల అక్రమ తొలగింపులు ఆపి, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.రాజు కార్మికశాఖాధికారిని కోరారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని కార్మిక శాఖ కార్యాలయం ఎదుట మంగళవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. హెచ్‌ఆర్ మేనేజర్ కార్మికులను వేధించడం మానేసి, 15 రోజుల జీతం బకాయిలను అపరాధ రుసుముత చెల్లించాలని రాజు డిమాండ్ చేశారు. ప్రస్తుత యాజమాన్యం వచ్చిన తర్వాత కార్మికులపై వేధింపులు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. బలవంతపు రాజీనామాలు, నోటీసులపై సంతకాలు చేయిస్తున్నారని, అలా అంగీకరించని కార్మికుల జీతాలు నిలిపివేస్తున్నారని విమర్శించారు. సంస్థకు నష్టాలు వస్తున్నాయని కుంటిసాకులు చెప్పి 38 మంది కార్మికులకు తొలగింపు నోటీసులు ఇచ్చారని పేర్కొన్నారు. 15 రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ యాజమాన్యం ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేస్తూ కార్మికులను మరిన్ని ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.నాయుడు, సీహెచ్ నూకరాజు, శ్రీను, వెంకటరావు, రమణమ్మ పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టుకు 27వ ర్యాంకు

... 5వ పేజీ తరువాయి

9.9 శాతం ఉన్నప్పటికీ మిగిలిన విమానాశ్రయాల్లో ఈ పెరుగుదల ఇంకా అధికంగా ఉండటంతో విశాఖ స్థానం తగ్గిపోయింది. పొరుగునే ఉన్న ఒడిశా రాజధాని భువనేశ్వర్ విమానాశ్రయం 46,00,615 మంది ప్రయాణికులతో 14వ స్థానం దక్కించుకుంది. భువనేశ్వర్ విమానాశ్రయం నుంచి అంతకుముందు ఏడాది 36,24,905 మంది ప్రయాణించారు. వార్షిక వృద్ధి రేటు అక్కడ 26.9 శాతం నమోదైంది. విశాఖ కంటే 1.7 రెట్లు అధికం.

- విజయవాడ విమానాశ్రయం 2023-24లో 10,62,506 మంది ప్రయాణికులతో 45వ స్థానం, తిరుపతి విమానాశ్రయం 8,70,662 మందితో 46వ స్థానం దక్కించుకున్నాయి. అన్ని విమానాశ్రయాల్లో 2023-24లో ప్రయాణికుల సంఖ్య పెరగగా, తిరుపతిలో అంతకు ముందు ఏడాది కంటే తక్కువ నమోదుకావడం గమనార్హం. 2022-23లోనే తిరుపతి నుంచి 9,19,267 మంది ప్రయాణించారు. ఆ తరువాత ఏడాది వారి సంఖ్య 48,605 తగ్గిపోయింది.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు చెక్

... 5వ పేజీ తరువాయి

జోన్-6 (గాజువాక) ప్రాంతాల్లో యూజీడీ అందుబాటులోకి తేవడంతోపాటు కోర్‌సిటీ పరిధిలో ప్రస్తుతం ఉన్న యూజీడీ నెట్‌వర్క్‌ను పెంచేందుకు పనులు జరుగుతున్నాయన్నారు. నగరంలో ఇప్పటికే లక్ష వరకూ యూజీడీ కనెక్షన్లు ఉండగా 95 వేల కనెక్షన్లకు వేర్వేరు కారణాలతో లబ్ధిదారులు ముందుకురావడం లేదన్నారు. నగరంలో 24 చోట్ల మురుగునీరు నేరుగా సముద్రంలో కలుస్తోందని, వాటిలో 14 పాయింట్లను డిసెంబరు నాటికి సమీపంలోని ఎస్‌టీపీలకు మళ్లించే పని పూర్తవుతుందన్నారు. శుద్ధిచేసిన నీటిని పరిశ్రమలకు విక్రయించడం ద్వారా ఏటా రూ.30 కోట్లు ఆదాయం సమకూరుతుందన్నారు. నగరంలో తాగునీరు కలుషితం కాకుండా ఉండేందుకు డ్రైనేజీలను క్రాస్ చేస్తున్న పైప్‌లైన్ పాయింట్లు 274 గుర్తించి వాటిని వేరే మార్గాల్లోకి మళ్లించామన్నారు. నీటి కాలుష్యం జరిగితే గుర్తించేందుకు వీలుగా ప్రతి రోజూ మూడుసార్లు నీటి శాంపిల్స్‌ను జీవీఎంసీ ల్యాబ్‌ల్లో పరీక్షిస్తున్నామన్నారు. నగరమంతటికీ నిరంతరం నీరు సరఫరా చేయాలంటే రూ.1,200 కోట్లు అవసరమవుతుందన్నారు. జీవీఎంసీ పరిధిలో వీధి దీపాల పనితీరును మెరుగుపరిచే చర్యలు ప్రారంభమయ్యాయని, లైటింగ్ తక్కువగా ఉంటుందనే ఫిర్యాదులు అందుతున్నందున 50 వేల స్తంభాలకు 70 వాట్స్ లైట్లను ఏర్పాటుచేసి లైటింగ్ పెంచుతామన్నారు. జీవీఎంసీ పరిధిలో 600 ఎకరాల విస్తీర్ణంలో 1200 ఓపెన్‌స్పేస్‌లు ఉన్నాయని వాటిలో 400 ఓపెన్‌స్పేస్‌లకు ఇప్పటికే కంచెలు ఉండగా మిగిలిన వాటికి రెండు వరుసల్లో మొక్కలునాటడం ద్వారా గ్రీన్ ఫెన్సింగ్ ఏర్పాటుచేస్తామన్నారు. అలాగే కాపులుప్పాడలో 22 ఎకరాల్లో మొక్కలు నాటుతున్నామన్నారు. దీనివల్ల జీవీఎంసీలో ప్రస్తుతం 28 శాతం ఉన్న పచ్చదనం 33 శాతానికి పెరుగుతుందన్నారు. అనధికార భవనాలను గుర్తించేందుకు వీలుగా డ్రోన్‌ల ద్వారా సర్వే చేసే ప్రతిపాదన ఉందన్నారు. వంద గజాల్లోపు నిర్మాణాలకు ప్లాన్ అవసరం లేదని రాష్ట్రప్రభుత్వం ప్రకటించిందని, దీనివల్ల చాలావరకూ ఫిర్యాదులు తగ్గిపోతాయని ఆశాభావం వ్యక్తంచేశారు.

సదరం.. సమస్యలు అనేకం

... 5వ పేజీ తరువాయి

ఉండే నాయకులు... తమను పెన్షన్ గురించి ఎవరైనా అడిగితే వైజాగ్‌లో ఫలానా ఆస్పత్రికి వెళ్లి సర్టిఫికెట్ తెచ్చుకుంటే వెంటనే ఇప్పించేస్తా అని చెబుతుండడం మరో కారణంగా తెలుస్తోంది. ఆస్పత్రుల్లో వైద్యులు సదరు దివ్యాంగులతో మాట్లాడినప్పుడు ఇదే విషయాన్ని చెబుతున్నారు. దీంతో వైద్యులు, అక్కడున్న సిబ్బంది సదరం సర్టిఫికెట్లు అందించే ప్రక్రియను, స్లాట్ బుక్ చేసే విధానాన్ని తెలియజేసి వారిని వెనక్కి పంపిస్తున్నారు.

దళారుల దందా

అనేక ప్రాంతాల్లో దళారులు దివ్యాంగుల అమాయకత్వాన్ని 'సొమ్ము' చేసుకుంటున్నారు. పెన్షన్ వచ్చేందుకు అవసరమైన సర్టిఫికెట్ మంజూరు చేయిస్తామని చెప్పి రూ.10 వేలు నుంచి రూ.20 వేలు వసూలు చేస్తున్నారు. నెలల తరబడి తిప్పుతూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నార తప్ప పని చేయడం లేదు. ఇటువంటి దళారుల బాధితులు ఎంతోమంది వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు.

స్లాట్ డేట్ మర్చిపోయి..

ఆన్‌లైన్‌లో ఖాళీ బట్టి నెల నుంచి రెండు నెలలు వ్యవధిలో స్లాట్ దొరుకుతుంది. అయితే, ఎంతోమంది తమకు ఆన్‌లైన్‌లో ఇచ్చిన స్లాట్ తేదీలను మర్చిపోతున్నారు. ఆ తేదీలు ముగిసిన తరువాత ఆస్పత్రులకు వస్తున్నారు. స్లాట్ కేటాయించినప్పుడు రాకపోతే తాము చేసేదేమీ ఉండదని వైద్యులు చెబుతున్నారు. దీంతో వైద్యులతో కొందరు వాదనకు దిగుతుంటారు.

పెన్షన్ సర్టిఫికెట్ ఇస్తారంటే వచ్చేశాం

షుగర్ వల్ల కాలికి ఇన్‌ఫెక్షన్ సోకింది. కరోనా సమయంలో కాళ్లు తీసేయాల్సి వచ్చింది. ఊర్లో ఉన్న వాళ్లు కేజీహెచ్‌కు వెళ్లి సర్టిఫికెట్ తెచ్చుకుంటే పెన్షన్‌కు పెడతామని చెప్పారు. దీంతో ఆదివారం బయలుదేరి వచ్చాం. రాత్రి ఒంటి గంట అయింది. రైల్వే స్టేషన్‌లో పడుకుని ఉదయాన్నే కేజీహెచ్‌కు వచ్చాం. ఓపీ తీసుకుని డాక్టర్ దగ్గరకు వెళ్లేసరికి 11 గంటలు అయింది. తీరా డాక్టర్‌ను సర్టిఫికెట్ ఇవ్వమంటే కుదరదన్నారు. ఆన్‌లైన్‌లో సదరం స్లాట్ బుక్ చేసుకుని రావాలని చెప్పారు. ఊళ్లో ఎవరూ ఈ విషయాన్ని చెప్పలేదు. అనేక ఇబ్బందులు పడి ఇక్కడకు వచ్చినా ఉపయోగం లేకుండా పోయింది. ఆస్పత్రి అంతా ఇలా చిన్నపాటి బల్లల సాయంతో తిరిగాను. వీల్ చైర్ అడిగితే డబ్బులు అడిగారు. డబ్బులు ఇచ్చే స్థోమత లేకపోవడంతో వీటి సాయంతోనే ఆస్పత్రి అంతా తిరిగాను. **- రాయి సత్తిబాబు, మండపేట**

వణికిస్తున్న జ్వరాలు

... 5వ పేజీ తరువాయి

చాలామంది జ్వర బాధితుల్లో బాడీ, జాయింట్ పెయిన్స్ తీవ్రమైన తలనొప్పి వంటి లక్షణాలు ఉంటున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు.

ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు: నగర పరిధిలో జ్వరపీడితులు పెరుగుతున్నారు. ఇంట్లో ఎవరో ఒకరూ జ్వర లక్షణాలతో బాధపడుతూ కనిపిస్తున్నారు. కేజీహెచ్, విమ్స్‌తోపాటు అర్బన్ హెల్త్ సెంటర్స్, ప్రైవేటు ఆస్ప త్రులకు జ్వర లక్షణాలతో ప్రతిరోజూ వందలాది మంది వస్తున్నారు. కేజీహెచ్, విమ్స్‌లకు ప్రతిరోజూ 50 మందికి తగ్గకుండా వస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

అప్పన్న భూముల వ్యవహారంపై 22న విచారణ

... 5వ పేజీ తరువాయి

మాన్సాస్ ట్రస్టు ఈఓగా పనిచేసిన కోడూరి రామచంద్రమోహన్ అవినీతికి పాల్పడ్డారని, చట్ట వ్యతిరేకంగా వందలాది ఎకరాల భూముల వివరాలను రికార్డుల నుంచి తొలగించారని ఆరోపణలు అందడంతో 2019లో వైసీపీ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని నియమించగా విచారణ జరిపి నివేదికను సమర్పించింది. దీనిపై విచారణకు హాజరుకావాలని కమిషనర్ ఆదేశించారు. పరిశీలించిన అంశాలు, వాస్తవాలు, నిజంగానే భూముల గోల్‌మాల్ జరిగిందా, అందుకు సంబంధించిన సాక్ష్యాలను సేకరించారా అనేదానిపై ఆరా తీస్తారని సమాచారం.

ఉక్కు ఉద్యమ కార్యాచరణ

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటుచేయాలని నిర్ణయించామన్నారు. 24న పాతగాజువాక నుంచి కొత్తగాజువాక వరకూ భారీ ర్యాలీ, సమావేశం, 27న ఉత్తరాంధ్ర మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామన్నారు. ఇక 28వ తేదీ ఉదయం ఎనిమిది నుంచి మరుసటిరోజు సాయంత్రం ఆరు గంటల వరకు (34 గంటలు) కూర్మన్నపాలెంలోని శిబిరంలో దీక్ష చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా ఉద్యమ కార్యాచరణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, కేఎస్ఎన్ రావు, వరసాల శ్రీనివాసరావు, జె.రామకృష్ణ, కారు రమణ, యు.రామస్వామి, అప్పారావు, విళ్లా రామ్మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రసంగాలు


సమావేశంలో మాట్లాడుతున్న అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, చిత్రంలో ఇతర ప్రముఖులు

సీతంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల నేపథ్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన శతజయంతి సాహితీ మూర్తుల ప్రసంగ లహరి ఆకట్టుకుంది. అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 'కాళీపట్నం రామారావు కథల్లోని వాస్తవిక జీవిత చిత్రణ, కారా కథలు-సామాజిక వాస్తవికత' అనే అంశంపై అరసం కార్యదర్శి డాక్టర్ సి.ఎస్. క్షేత్రపాల్ రెడ్డి ప్రసంగించారు. ప్రముఖ విశ్లేషకులు డాక్టర్ డి.వి. సూర్యారావు మాట్లాడుతూ వజ్రాయుధం అభ్యుదయ కవితాకేతనం అన్నారు. సోమసుందర్ గొప్ప విమర్శకుడంటూ ఆయన గ్రంథాలను ప్రస్తావించారు. ప్రముఖ కవి శాఖ రాంభట్ల నృసింహ శర్మ ప్రసంగిస్తూ దాశరథి చలన చిత్ర గీతాలపై విశ్లేషణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.సుబ్బారావు, ఆచార్య వెలమల సిమ్మన్న, బసు పోతన, అరసం ప్రతినిధులు, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో విద్యార్థులకు పతకాలు


బాక్సింగ్: పతకాలు సాధించినవారిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ బోస్ తదితరులు

విశాఖపట్నం, స్పోర్ట్సు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంతర్ కళాశాలల పురుషులు, మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో గాయత్రి విద్యాపరిషత్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు పతకాలు సాధించారు. నగరంలో జరిగిన ఈ టోర్నీ పురుషుల విభాగంలో యు.రాకేష్ రోషన్ యాదవ్ రజత పతకం, ఎస్.హరీష్ కాంస్య పతకం సాధించగా మహిళల కేటగిరిలో కె.వాసవి, కె.రమ్యలత కాంస్య పతకాలు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా పతక విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కెఎస్.బోస్, డైరక్టర్ ఆచార్య పి.మోహిని, ఫిజికల్ డైరక్టర్ పి.కిషోర్‌కుమార్ అభినందించారు.

రైతుబజారులో అడ్డంగా సిమెంట్ రేకులు


నరసింహనగర్ రైతు బజారులో కుప్పగా వేసిన సిమెంటు రేకులు

అక్కయ్యపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతు బజారు ఆవరణలో పాత సిమెంట్ రేకులు కుప్పలుగా వేసి వదిలేశారు. దీని వల్ల బజారుకు వచ్చిన కొనుగోలుదారులు వాహనాలను నిలపడానికి సౌకర్యంగా లేదు. కొన్ని నెలల క్రితం రైతుబజారులోని స్టాల్స్‌పై ఉన్న సిమెంట్ రేకులు తొలగించి కొత్తగా ఇనుప రేకులు వేశారు. ఆ పాత రేకులను అక్కడే ఖాళీ స్థలంలో కుప్పగా వేశారు. అవి అడ్డుగా ఉండడంతో రైతుబజారుకు వచ్చే కొనుగోలుదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేద్దామంటే వీలు కుదరకపోవడంతో ఎక్కడబడితే అక్కడ అడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. మిగతా వారు లోపలకు రావాలన్నా, బయటకు వెళ్లాలన్నా అవస్థలు పడుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన రైతులు వారికి కేటాయించిన స్టాళ్లలో కాకుండా ఖాళీగా ఉన్న స్థలంలో అరటి గెలలు, ఇతర సామగ్రి పెట్టేశారు. దీనివల్ల కూడా అందరూ ఇబ్బంది పడుతున్నారు. రైతులకు కేటాయించిన స్టాళ్లలో కాకుండా ఖాళీ స్థలంలో పెట్టడం వల్ల తమకు అసౌకర్యంగా ఉంటోందని కొనుగోలుదారులు చెబుతున్నారు. ఈ విషయంపై రైతుబజారు ఎస్టేట్ అధికారి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

☛ సంక్షిప్తంగా..

ఈవీఎం గోదాములు తనిఖీ చేసిన కలెక్టర్



విజిటర్స్ బుక్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

ఆరిలోవ, నవంబరు 19 : (ఆంధ్రజ్యోతి) : చినగదిలి రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో గల ఈవీఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. నెల వారీ తనిఖీల్లో భాగంగా మంగళవారం ఉదయం సిబ్బందితో వెళ్లి గోదాములను సందర్శించారు. అక్కడి పరిస్థితులను గమనించారు. సీసీ కెమెరాల పని తీరు, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అక్కడ ఉన్న సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందించారు. అక్కడ ఉన్న విజిటింగ్ రిజిస్టర్‌లో ఆయన సంతకం చేశారు. ఆయన వెంట ఎన్నికల సెల్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నీరు, పారిశుధ్య నిర్వహణపై శిక్షణ



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, పాల్గొన్న టీవోటీ సభ్యులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత వంటి అంశాలపై డీఆర్‌డీఏ కార్యాలయంలో మంగళవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు డైరెక్టర్ బి.లక్ష్మీపతి ఆధ్వర్యంలో యూనిసెఫ్, సెర్ప్ సమన్వయంతో టీవోటీ సభ్యులకు గ్రామాల్లో పారిశుధ్యం, రక్షిత మంచినీరు నిర్వహణ, మరుగుదొడ్లు, చెత్త, వ్యర్థాల నిర్వహణ, వ్యక్తిగత అలవాట్లపై మండల స్థాయిలో వీవోఏలు, వీవోటీలు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలు, సాధించిన ప్రగతి, జీవనోపాధి పథకాల అమలు వంటివాటిపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ పుల్లయ్య, డీపీఎంలు, ఏపీఎంలు, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కంగువా :** సంగం, జగదాంబ, మెలోడీ, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **మట్కా :** శరత్, శారద, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **అపుడో, ఇపుడో, ఎప్పుడో:** లిలిత (శ్రీహరిపురం)
- **క :** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా)సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :** రమాదేవి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 28, వంకాయలు (తెలుపు)32, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 18, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 30, క్యారెట్ 64 దొండకాయలు 32, బంగాళ దుంపలు 40, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది)50, బరబాటి 30, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 36, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 55, పొటల్స్ 52, కీరదోస 24, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడ దుంపలు 32, కంద 66, దేముడు చిక్కుడు 82, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్రరపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	95
ఫారం ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

గాఢాంధకారంలో పిఠాపురం కాలనీ



కళాభారతి ఏరియాలో కమ్ముకున్న చీకటి



లైట్లు వెలగక ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

- 22వ వార్డులో వెలగని వీధి దీపాలు
- ఇటీవల దుకాణాలు తొలగించడంతో కానరాని అలికిడి
- వాహనదారులు, పాదచారుల ఇక్కట్లు
- చోరుల స్వైరవిహారం
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

మద్దిలపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డులో వీధి దీపాలకు గ్రహణం పట్టుకుంది. రాత్రయితే వీధులన్నీ అంధకారంలో మగ్గుతున్నాయి. వీధి లైట్లు వెలగకపోవడంతో తరచుగా వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. కానీ ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. శివాజీపాలెం పరిధిలోని పిఠాపురం కాలనీ, కళాభారతి ఏరియా, పీతలవానిపాలెం, బలరాంనగర్, మంగాపురం కాలనీ, రాజీవ్‌నగర్, తారా మసీదు ఏరియాల్లో వీధి దీపాలు పాడయ్యాయి. దీంతో చీకటి పడితే ఆయా ఏరియాల్లో అంధకారం అలుముకుంటోంది. రాత్రిళ్లు ఇళ్లకు వెళ్లే వాహనదారులు, పాదచారులు చీకటిలో బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తోంది. గతంలో వార్డులోని అన్నీ ప్రాంతాల్లో వీధి దీపాలు అమర్చారు. కొద్ది నెలలు పనిచేసిన తర్వాత ఒక్కొక్కటిగా మరమ్మతుకు గురయ్యాయి. నెలలు గడుస్తున్నా కొత్త వీధి దీపాలు వేయకపోవడంతో చీకట్లు కమ్ముకుంటున్నాయి.

వీధి దీపాలు వెలగకపోవడంతో శివాజీపాలెంలో రాత్రిళ్లు దొంగతనాల బెడద ఎక్కువైంది. ఇళ్ల ముందు పార్కింగ్ చేస్తున్న బైక్‌లు, పెట్రోల్, నివాసాల కిటికీల పక్కన పెట్టే వస్తువులను చోరీ చేస్తున్నారు. వీధులు చీకట్లో ఉన్నందున రోడ్లపై ఎవరు తిరుగుతున్నారో స్థానికులు గుర్తించలేకపోతున్నారు. కళాభారతి పార్కు వద్ద గాఢాంధకారం ఉండడంతో అక్కడ ఆకతాయిలు గంజాయికి అడ్డాగా చేసుకున్నారు. ప్రతీ రోజు సాయంత్రం అయితే చాలు అక్కడకు పదుల సంఖ్యలో చేరి గంజాయి, మద్యం సేవిస్తున్నారు. మద్యం మత్తులో దొంగనాలకు పాల్పడుతున్నారు. బాధితులు పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండాపోయింది.

నిర్మానుష్యంగా రోడ్డులు..

వార్డులోని దుకాణాలు తొలగించడంతో రోడ్డులన్నీ నిర్మానుష్యంగా మారాయి. మొన్నటి వరకు రోడ్డులపై ఫాస్ట్‌ఫుడ్, తోపుడు బండ్ల వ్యాపారాలతో రోడ్డుల్లో కొంత అలికిడి ఉండేది. అంతేకాకుండా దుకాణాల లైట్ల వెలుగుతో రోడ్డు కూడా కనిపించేది. ఇటీవల దుకాణాలన్నీ తొలగించడంతో వీధులన్నీ నిర్మానుష్యంగా తయారయ్యాయి. బస్సు, ఆటో సర్వీస్‌లు ఏవీ కళాభారతి రోడ్డులో ఉండవు. కేవలం ఈ ప్రాంతవాసులు మాత్రమే ఈ రోడ్డులో ఇళ్లకు చేరుకుంటారు. అందుకే దుకాణాలు తీసేశాక జనాలు లేక రోడ్లు చీకటిమయంగా మారిపోయాయి. అధికారులు స్పందించి వెంటనే ఆయా ప్రాంతాల్లో విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దుకాణాలు తీయించి దారుణానికి ఒడిగట్టారు

- కార్పొరేటర్‌ను చుట్టిముట్టిన వీధి వ్యాపారులు
- సమాధానం చెప్పలేక నీళ్లు నమిలిన మూర్తి యాదవ్



కార్పొరేటర్ పీతల మూర్తిని చుట్టుముట్టిన నిలదీస్తున్న వీధి వ్యాపారులు

మద్దిలపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ సొంత వార్డులో తీవ్ర వ్యతిరేకతను చవిచూశారు. హైకోర్టులో కేసు వేసి వీధి దుకాణాలు తొలగించడంపై వ్యాపారస్తుల నుంచి నిరసన ఎదుర్కొన్నారు. మంగళవారం ఉదయం వార్డు సచివాలయం సమీపంలో ఆ సిబ్బందితో మాట్లాడుతుండగా ఆయనకు చేదు అనుభవం ఎదురైంది. వార్డుకు చెందిన వీధి వ్యాపారులు మూర్తియాదవ్‌ను నిలదీయడమే కాకుండా ముందుకు కదలనీయకుండా చుట్టుముట్టారు. ముప్పై ఏళ్లగా నిర్వహించుకుంటున్న వ్యాపారాలను ఎందుకు నాశనం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చిల్లర వ్యాపారాలు చేసుకుని కుటుంబాలు పోషించుకుంటున్న తాము ఇప్పుడు బతికేదెలా అంటూ ప్రశ్నించారు. 'జీవీఎంసీ ఎన్నికల్లో మీ గెలుపు కోసమే వీధి వీధిన జెండాలు మోసాం, దానికి ఇదా ప్రతిఫలం' అంటూ నిష్ఠూరమాడారు. 'మీరు కార్పొరేటర్ అయితే మాకు అండగా ఉంటారని భావిస్తే మా పొట్ట ఎందుకు కొట్టారు' అంటూ ప్రశ్నించారు. వ్యాపారాలు కోల్పోయి రోడ్డున పడ్డా బాధితులు ఆగ్రహంతో సంధించిన ప్రశ్నలకు ఏం సమాధానం చెప్పాలో తెలియక మూర్తియాదవ్ నీళ్లనమిలారు.

'దుకాణాలు తీయడం తప్పే జీవీఎంసీ అధికారులకు అడగండి' అంటూ పొంతని లేని సమాధానాలు చెప్పి అక్కడ నుంచి జారుకున్నారు.



ఆదర్శ నగర్ కూడలి వద్ద ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్

ఆదర్శనగర్ కూడలిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ చర్యలు

- ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్

ఆరిలోవ, నవంబరు 19 : (ఆంధ్రజ్యోతి) : ఆదర్శనగర్ కూడలిలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించే క్రమంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని, దీనిపై పోలీసు కమిషనర్‌తో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఏడీసీపీ కె.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన ఆదర్శనగర్ కూడలి ప్రాంతాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నిత్యం అధికంగా వాహనాల రాకపోకలు ఉండడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని అన్నారు. ప్రధానంగా ఆదర్శనగర్ వైపు వెళ్లే వాహనాలు ఎక్కువగా ఉండడం, ఈ కూడలిలో రోడ్డు సన్నగా ఉండడంతో సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. అలాగే రోడ్డు పక్కన ఉన్న దుకాణాలు కూడా సమసమస్యకు ఒక కారణమని అన్నారు. ఏడీసీపీ వెంట సీఐ ప్రసాద్, ఎస్‌ఐ, సిబ్బంది ఉన్నారు.

ఇక్కడ ట్రాఫిక్ సమస్యపై స్థానిక టీడీపీ నేత సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు పోలీసుఅధికారులు స్పందించారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యస్వామి పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వెంకోజీపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం మంగళవారంపురస్కరించుకుని కొత్త వెంకోజీపాలెంలోని జ్ఞానానంద ఆశ్రమం శ్రీగౌరీజ్ఞానలింగేశ్వరాలయ దేవస్థానంలో వేంచేసి ఉన్న నాగదేవత, శివుడు సమేతంగా ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలనునిర్వహించారు. తెల్లవారు జాము నుంచి ఆలయానికి చేరుకుని విశేష అభిషేకాలు నిర్వహించారు. పాలు, పెరుగు, తేనే, నెయ్యి, పంచదార. పసుపు, కుంకుమ, విభూది, పుష్పాలు, రోజ్‌వాలు తదితర వాటితో స్వామి వారిని భక్తులు స్వయంగా అభిషేకం జరిపారు. భక్తులతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. కార్యక్రమంలో అర్చకులు అరవెల్లి సూర్యప్రకాష్‌శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాలభాస్కరశర్మ భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు నిర్వహించి, తీర్థప్రసాదాలను అందజేశారు. గ్రామ సేవా సంఘం సభ్యులు, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

క్రీడల్లో గురుకులం విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రత్నవల్లి, ఉపాధ్యాయులు

ఆరిలోవ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు జిల్లా కొప్పెర్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన జోనల్ స్థాయి స్పోర్ట్‌మీట్‌లో తమ పాఠశాల విద్యార్థులు పలు క్రీడాంశాల్లో పతకాలు సాధించినట్టు అంబేడ్కర్ గురుకులం (విశాఖపట్నం) ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. ఏపీ సాంఘిక సంక్షేమ గురుకులం విద్యార్థులు జోన్-1లో గల శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు.

జూనియర్ విభాగంలో చెస్, క్యారమ్స్ పోటీల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకొని ట్రోఫీ సాధించారు. పరుగు పందెం, ట్రాక్ అండ్ ఫీల్డ్, షాట్‌పుట్, త్రోబాల్, జావెలిన్‌తో పతకాలు సాధించారు.

సీనియర్స్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి సీహెచ్ అభినయ షార్ట్‌పుట్‌లో గోల్డ్ మెడల్, డిస్క్ త్రోబాల్‌లో గోల్డ్ మెడల్, జావలిన్‌త్రోలో సిల్వర్ మెడల్ సాధించాడు. అలాగే 1500 మీటర్ల పరుగు పందెంలో డి.దీక్షత్‌చరణ్ తేజ ద్వితీయ స్థానం, ఆర్.శివకుమార్ తృతీయ స్థానం సాధించారు.

జూనియర్స్ విభాగం చెస్‌లో ఆదిత్య యశ్వంత్ ద్వితీయ స్థానం,. క్యారమ్స్‌లో కేఎల్ నారాయణ, ఆర్.సందీప్ చెస్‌లో ట్రోఫీలను కైవసం చేసుకున్నారు. పరుగులో సీహెచ్ అభి వ్యక్తిగత చాంపియన్ షిప్‌ని కైవసం చేసుకున్నాడు.

ఈ సందర్భంగా క్రీడలలో ప్రతిభలను కనబరిచిన విద్యార్థులను గురుకులాల విశాఖ, అనకాపల్లి జిల్లాల సమన్వయకర్త ఎస్.రూపవతి, ప్రిన్సిపాల్ రత్నవల్లి, వైస్ ప్రిన్సిపాల్ బీకే రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులకు మంచి తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎ.సత్యసుధాకర్, పీఈటీ జె.వివేకానందను ప్రశంసించారు.

అవయవ దానంపై అవగాహన ఉండాలి

- కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్



రామారావు మృతదేహానికి పూలమాల వేస్తున్న హరేంధిర ప్రసాద్

ఆరిలోవ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అవయవ దానం పట్ల ప్రజలందరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ కోరారు. ఈ నెల 17న దువ్వాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వాసిరెడ్డి రామారావు (57) అనే వ్యక్తి సోమవారం బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు ప్రకటించడంతో ఆయన అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఈ నేపథ్యంలో రామారావు మృతదేహానికి మంగళవారం కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అవయవ దానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులను అభినందించి, రాష్ట్ర ప్రభుత్వం తరపున పది వేలను అందజేశారు. ఈ సందర్భంగా షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ అవయవదానం ద్వారా నలుగురి జీవితాల్లో వెలుగులు నింపవచ్చన్నారు. రాష్ట్రంలో సుమారు నాలుగు వేల మంది వివిధ అవయవాల కోసం ఎదురుచూస్తున్నారని, అందువల్ల ఆప్తులను కోల్పోయినప్పుడు సంబంధిత కుటుంబ సభ్యులు ధైర్యం తెచ్చుకుని మృతుని అవయవాలను దానం చేసి నలుగురి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు.

కార్యక్రమంలో జీవన్‌దాన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు, పలువురు వైద్యులు పాల్గొన్నారు. కాగా రామారావు నుంచి సేకరించిన ఊపిరితిత్తులు, గుండె, కిడ్నీ అవయవాలను గ్రీన్ చానల్ ద్వారా వివిధ ప్రాంతాలకు తరలించినట్లు ట్రస్టు సభ్యులు పేర్కొన్నారు.

'చెత్త సమస్య'ను పట్టించుకోరే!

- ఏడో సెక్టర్‌లో చెత్త తరలింపుపై నిర్లక్ష్యం



ఏడో సెక్టరు ప్రధాన రహదారిని ఆనుకుని మినీ డంపింగ్ యార్డు తలపిస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. నెలల తరబడి ఎక్కడికక్కడే చెత్తాచెదారం కళ్లెదుటే కనిపిస్తున్నా పారిశుధ్య సిబ్బంది తొలగింపునకు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గ్రేటర్ విశాఖ 18వ వార్డు పరిధిలోని ఎంవీపీ కాలనీ ఏడో సెక్టరులో ప్రధాన రహదారిని ఆనుకుని ఓ ప్రదేశం మినీ డంపింగ్ యార్డులా మారింది. ఎక్కడి చెత్తను తీసుకొచ్చి, పరిసర ప్రాంత వాసులు పోసేస్తుండడంతో గుట్ట తయారైంది. ఓ పక్క బ్యాంకు ఉన్న భవనం, మరో పక్క గోడ, మధ్యలో కొద్ది ప్రదేశం.. ఎవరికీ ఇబ్బంది లేకపోవడంతో అదే డంపింగ్ యార్డులా వినియోగించేస్తున్నారు. దీన్ని పారిశుధ్య సిబ్బంది తొలగించకపోవడంతో చెత్తాచెదారం గుట్టలా పేరుకుపోయింది. వర్షానికి చెత్త తడిచిపోయి, దుర్గంధం వ్యాపిస్తోంది. మరో పక్క విపరీతంగా దోమలు వృద్ధి చెందడంతో ఇబ్బందిగా మారుతోంది. ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ చెత్తాచెదారం గుట్ట రోజురోజుకూ పెరుగుతోంది. జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు ఇప్పటికైనా స్పందించి, చెత్తను తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే ఇక్కడ చెత్త వేయకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచిస్తున్నారు.

గ్రంథాలయంలో ఇందిరమ్మ జయంతి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని నగర శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 108వ జయంతి నిర్వహించారు. గ్రంథాలయాధికారి కేవీఎ ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు సత్యశ్రీ, పద్మ, సచివాలయం వైద్య విభాగం కార్యదర్శి సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ నిర్ణయాలు సాహసోపేతం, స్ఫూర్తిదాయకం



ఇందిరా గాంధీకి నివాళులు అర్పిస్తున్న ఐఏఎస్‌ఈ ప్రిన్సిపాల్ నాగరాజకుమారి, విద్యార్థులు

వెంకోజీపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : భారత దేశంలో అతి పిన్న వయస్సులోనే తొలి మహిళా ప్రధానిగా ఇందిరా గాంధీ బాధ్యతలు చేపట్టడం మహిళా లోకానికి గర్వకారణమని, అటువంటి ఆమె స్ఫూర్తితో నేటి మహిళలంతా ముందుకు సాగాలని ఏయూ ఐఏఎస్‌ఈ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాగరాజకుమారి సూచించారు. మంగళవారం ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఐఏఎస్‌ఈ అండ్ ఇగ్నో కేంద్రం సంయుక్తంగా సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజ కుమారి మాట్లాడుతూ ఇందిరా గాంధీ బ్యాంకులు జాతీయం చేశారని, గరీబీ హఠావో అనే నినాదంతో దేశ ప్రజలని ఉత్తేజపరిచారని, 1971 'భారతరత్న' పురస్కారాన్ని పొందిన మొట్టమొదటి మహిళా కూడా అని కొనియాడారు.

అలాగే విద్యార్థులు, నవ్య, దీపక్, పాల్, సురేష్, వారి మాటలో ఇందిరా గాంధీ దేశానికి చేసిన మంచి పనులు, సాధించిన ఘనతలు, అన్ని రంగాల్లో ఆమె చేసిన కృషిని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ పుష్ప, డాక్టర్ సోనీ హవిల, డాక్టర్ తిరుమలాంబ, డాక్టర్ విద్యావతి, డాక్టర్ శ్రీదేవి, పీడీ లక్ష్మయ్య పాల్గొన్నారు.

రూ.16 లక్షలతో ప్రహరీ నిర్మాణం



నిర్మాణంలో ఉన్న ప్రహరీ

ఎంవీపీ కాలనీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ నాలుగో సెక్టరులోని ప్రశాంతి పార్కు చుట్టూ ప్రహరీ నిర్మాణం చురుగ్గా సాగుతోంది. రూ. 16 లక్షల జీవీఎంసీ నిధులతో దీనిని నిర్మిస్తున్నారు. గతంలో ఉన్న నిర్మాణం పూర్తిగా పాడైపోవడంతో నూతనంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పార్కు నిరాదరణకు గురైంది. ఈ ప్రాంతీయులకు చాలా అవసరమే అయినప్పటికీ కొన్నాళ్లుగా నిర్వహణ కొరవడటంతో ప్రస్తుతం ప్రహరీ నిర్మిస్తున్నట్లు జీవీఎంసీ ఏఈ అప్పలనాయుడు తెలిపారు. త్వరలోనే లోపల కూడా పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా నేషనల్ ఎంటర్‌ప్రెన్యూర్స్ డే వేడుకలు



కోటేశ్వరరావుకు సన్మానిస్తున్న ఆచార్యులు

వెంకోజీపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఏయూ మహిళా ఇంజనీరింగ్‌కళాశాలలో నేషనల్ ఎంటర్‌పెన్యూనర్స్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జోర డ్రోన్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ సీఈవో సాగర్ కోటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 'డ్రోన్స్ రంగంలో ఎంటర్‌పెన్యూనర్‌గా ఎదగడం, విజయం సాధించడం' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్ష కలిగిన వారికి స్ఫూర్తిని అందించే విధంగా ఈ ప్రసంగం సాగింది. డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి వాల్యూమెట్రిక్ అనాలసిస్ చేసే విధానాన్ని ఆయన తెలియజేశారు ప్రణాళిక, డేటా సంపాదించడం డేటా ప్రాసెస్ చేయడం, ప్రాజెక్టు పూర్తి చేయడం అనే దశలను విద్యార్థులకు తెలియజేశారు.

ఈ సందర్భంగా తాను నిర్వహించిన పలు ప్రాజెక్టులను విద్యార్థులతో పంచుకున్నారు. అలాగే ఆ హబ్ అందిస్తున్న ప్రోత్సాహం, ఇటీవల సాధించిన విజయవాలను విద్యార్థులకు వివరించారు.

ఈ సందర్భంగా సాగర్ కోటేశ్వరరావును కళాశాల తరపున సత్కరించారు. డ్రోన్ వ్యవస్థకు సాగర్ అందిస్తున్న సేవలు, కృషిని ప్రిన్సిపల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.పద్మశ్రీ, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య బి.ప్రజ్ఞ, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎస్.అరుణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞానం పంచిన ప్రదర్శన



నమూనాలతో సత్యసాయి విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : 'సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్, తగ్గింపు, పునర్వినియోగం, రీ-సైకిల్' అంశంపై ఎంవీపీ కాలనీలోని సత్యసాయి విద్యా విహార్‌లో మంగళవారం విద్యార్థుల ప్రదర్శన విజ్ఞానం పంచింది. నాలుగు, అయిదు తరగతుల విద్యార్థులు ప్రదర్శనలో వివిధ నమూనాలు ప్రదర్శించారు. ప్రణాళిక, పరిశోధన, సృజనాత్మకతతో సౌర ఫలకాలు, వర్షపునీటి సంరక్షణ, పర్యావరణ అనుకూల గృహాలు, సోక్ పిట్ వంటి నమూనాలు విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికితీశాయి. విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు.

సీపీఐ సభను విజయవంతం చేయాలి

మద్దిలపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 24న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరగనున్న బహిరంగ సభను ప్రజలంతా విజయవంతం చేయవలసిందిగా ఏఐటీయూసీ కార్యవర్గ సభ్యుడు కాండ్రేంగుల సత్యాంజనేయ కోరారు. 63వ వార్డు పరిధి కాకరలోవ భగత్‌సింగ్ కూడలిలో మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన వాల్ పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయాని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాంబాబు,కనకేశ్వరరావు, త్రినాథ్, వెంకట్‌పాల్గొన్నారు.

మూలకు చేరిన గుడ్డ సంచుల యంత్రం



నరసింహనగర్ రైతుబజారులో యంత్రం

అక్కయ్యపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 46వ వార్డు నరసింహనగర్ రైతుబజారులోని గుడ్డ సంచుల యంత్రం మూలకు చేరింది. వినియోగదారులు గుడ్డ సంచులు తీసుకుందామనుకున్నా అది పని చేయకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఈ యంత్రంలో రూ.10 నోటు గానీ, రూ.5 నాణేలు గాని రెండు వేస్తే సంచి వచ్చేది. ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని తగ్గించేందుకు ఈ యంత్రాన్ని గతంలో కాలుష్య నియంత్రణ మండలి రైతుబజారులో ఏర్పాటు చేసింది. దానిలో కొన్ని నెలలు గుడ్డ సంచులను పెట్టారు. ఆ తర్వాత దాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఆ యంత్రం మూలన పడడంతో సంచులు కొనుగోలు చేయడానికి వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఈ యంత్రాన్ని బాగుచేయించి ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించేందుకు దోహదపడాలని పలువురు కోరుతున్నారు.

ఆర్టీఐ ఆర్గనైజర్‌గా ఆల్ఫాకృష్ణ



డాబాగార్డెన్స్ నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి): సమాచార చట్టం అఖిల భారత మానవ హక్కుల సంఘానికి (హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్ అసోసియేషన్ ఆలిండియా) ప్రధాన ఆర్గనైజర్‌గా మూడేళ్ల కాలానికి తనను నియమించినట్లు సన్నికృష్ణ రాజయ్య బయగాని (ఆల్ఫాకృష్ణ) తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ బోర్డు కమిటీ వ్యవస్థాపక సీతాల కామేష్ గాడి నియామక పత్రం పంపారన్నారు. రాజ్యాంగ హక్కులకు సాధికారత, మానవ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ముందుకెళ్తానన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న వాసు ప్రకాష్

సీతమ్మధార, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత్ వికాస్ పరిషత్ నిర్వహించిన క్విజ్ పోటీల్లో తమ విద్యార్థులు ఎన్.ఇసాంత్ కార్తికేయ, జె.శ్రవణ్‌లు ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకుని జనవరి 19న లక్నోలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని శ్రీప్రకాష్ విద్యాసంస్థ వెల్లడించింది. ఏపీ నుంచి ఎంపికైన ఏకైక బృందంగా తెలిపింది. ఈ నెల 17న గుంటూరులో జరిగిన క్విజ్ పోటీ దక్షిణ క్షేత్ర స్థాయిలో నిర్వహించారని పేర్కొంది. ఎంపికైన తమ విద్యార్థులకు గుంటూరు మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారని తెలిపింది. వీరిని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ డైరెక్టర్ చిట్టూరి వాసు ప్రకాష్ అభినందించారు.

ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులు

కంచరపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులని జీవీఎంసీ రామ్మూర్తిపంతులపేట స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆర్పీపేట ఉన్నత పాఠశాల్లో మంగళవారం ప్రారంభమైన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం పుస్తకాలతో కుస్తీ పడుతూ నూతన విషయాలు తెలుసుకుంటూ ఉపాధ్యాయులు బోధన సాగించాలన్నారు. మారుతున్న సాంకేతిక, ప్రపంచీకరణ నేపథ్యంలో తదనుగుణంగా ఉపాధ్యాయులు ఉత్సాహంగా పుస్తక పఠనం చేస్తుండాలన్నారు. అనంతరం శిక్షణ కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. ఆర్పీలు పి.వెంకటేశ్వర్రావు, పి.చంద్రశేఖర్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

హమ్మయ్య...మళ్లీ చెలామణిలోకి రూ.పది నాణెం



చెల్లుబాటులోకి వచ్చిన పది నాణెం

జగదాంబ కూడలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పది నాణెం విడుదలయ్యే కొత్తలో అపురూపంగా కొందరు దాచుకునేవారు. క్రమంగా దాని చెలామణి పెరగడంతో రూ.పది నోటు 'పనైపోయినట్లే'నని భావించారు. ఆ తరువాత ఏమైందో.. ఏమో..! పది నాణెం చేతికివ్వగానే 'మాకు వద్దం'టూ చీదరించుకునేవారి సంఖ్య పెరిగింది. నిత్యావసరాలు, కాయగూరల మార్కెట్‌లో ఎక్కువగా అవసరమయ్యే రూ.10లను చెల్లని నాణెం అంటూ ప్రచారంలోకి తెచ్చారు. నాణెం చెలుబాటు అవుతుందని కొందరు తీసుకున్నా.. వారి నుంచి ఇతరులు తీసుకోవడానికి అంగీకరించకపోవడంతో విద్యావంతులు సైతం వద్దంటూ నాణేన్ని దూరంగా పెట్టారు. గత కొన్నేళ్లుగా ఈ నాణెం పూర్తి బహిష్కరణకు గురయ్యింది. ఎవరికి వారు దీన్ని చెల్లని నాణెంగా మార్చేశారు. నగరంలోని ప్రధాన మార్కెట్లు, వ్యాపార కూడళ్లు, బడా షాపింగ్ మాల్స్‌లో పది నాణెం చేతికిస్తే సున్నితంగా తిరస్కరించే పరిస్థితి నెలకొంది. రిజర్వు బ్యాంకు ఎటువంటి ఆంక్షలు పెట్టక పోయినా ఈ నాణేన్ని అకారణంగా వెలేశారు. దీంతో చెలామణిలోకి వచ్చిన నాణేలు బ్యాంకుల ద్వారా తిరిగి రిజర్వు బ్యాంకుకు చేరి గుట్టలుగా పేరుకు పోయాయి.. రిజర్వుబాంకు అధికారులు పలు ప్రకటనలు, హెచ్చరికలు చేసినా తొలుత జనంలో మార్పు రాలేదు. అయితే కొద్ది కాలంగా రూ.10 నోటు చెలామణి తగ్గిపోవడం, లావాదేవీలకు ఇబ్బందులు ఎదురవ్వడంతో వ్యాపార కూడళ్ళు, చిరువ్యాపారులు, తినుబండారాల అమ్మకందార్లు పది రూపాయిల నాణెంపై ఉన్న ఆంక్షలను పక్కన పెట్టేశారు. ఇటీవల యూనియన్ బ్యాంకు ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అవగాహన శిబిరం ఏర్పాటు చేసి పది నాణెం చెలామణిపై అపోహలు వద్దని వివరణ ఇవ్వడంతో నగరంలో అజ్ఞాతవాసం వీడిన పది నాణెం మళ్లీ జనం జేబులో గలగలలాడుతోంది. అన్ని వర్గాల వారు తీసుకుంటూ హమ్మయ్య..అని ఊపిరి పీల్చుకుంటున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టదా?



అంబేద్కర్ సర్కిల్ వద్ద గోతుల రహదారి

డాబాగార్డెన్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 31వ వార్డు డాబాగార్డెన్స్ అంబేద్కర్ విగ్రహం సర్కిల్ నుంచి కృష్ణాగార్డెన్స్‌కు వెళ్లే రహదారిలోనూ, సర్కిల్ నుంచి ఎల్ఐసీ కూడలి వెనుక రోడ్డువైపు వెళ్లే రహదారిలో కొద్ది రోజులుగా ప్రమాదాలు జరుగుతున్నా అధికారులకు చలనం లేకుండాపోతోంది. జ్యూపిటర్ హోండా షోరూం వద్ద గోతులతో పాటు పెద్ద గొయ్యి పడింది. వాహనదారులు అక్కడకొచ్చే సమయంలో ఒక్కసారిగా బ్రేకు వేయాల్సి రావడంతో ప్రమాదాలకు గురవుతున్నారు.కొందరు ద్విచక్రవాహనదారులు గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ముఖ్యమైన సర్కిల్‌లో మరమ్మతులు చేపట్టకపోవడంతో సమస్య ఇబ్బందికరంగా తయారైంది. అధికారులు తక్షణమే తారురోడ్డు మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

వెయిట్ లిఫ్టింగ్ విజేతకు అభినందనలు



తేజశ్రీని అభినందిస్తున్న దృశ్యం

సీతమ్మధార, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల వెయిట్ లిఫ్టింగ్ అండర్-19 బాలురు, బాలికల ఛాంపియన్ షిప్ పోటీలను గుడివాడలోని ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. డాక్టర్ లంకపల్లి జూనియర్ కళాశాలకు చెందిన ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని పి.తేజశ్రీ 45 కిలోల విభాగంలో రజత పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా తేజశ్రీని కళాశాల కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.సోమేశ్వరరెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీఎస్‌కే చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, పీడీ డాక్టర్ బీఆర్ఎస్ లక్ష్మణ రెడ్డి, మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వ విధానాలపై 26న నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న కె.లోకనాథం

జగదాంబ కూడలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న చేపడుతున్న దేశవ్యాప్త నిరసనలో కార్మికులు, కర్షకులు భాగస్వాములు కావాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.లోకనాథం పిలుపునిచ్చారు. సిటు కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలతో అణచివేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలోని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం కేంద్రానికి తొత్తుగా మారడం వల్లనే హక్కులకు భంగం వాటిల్లుతోందని దుయ్యబట్టారు. విశాఖ ఉక్కును కాపాడుతామంటూ ఎన్నికల ముందు హామీలిచ్చిన టీడీపీ, జనసేన నాయకులు కాంట్రాక్టు కార్మికులను అక్రమంగా తొలగించినా మౌనం వహించడం దుర్మార్గమన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముందస్తుగా ఈ నెల 24న ఉదయం 10 గంటలకు పాత గాజువాక జంక్షన్ నుంచి, విశాఖ డీఆర్ఎం కార్యాలయం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు చేపట్టనున్న ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిటు నాయకులు కుమార్, సీపీఎం నాయకుడు గంగారావు, బొట్టా ఈశ్వరమ్మ, జిల్లా అధ్యక్షుడు కె.ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడు శవమై తేలాడు



మృతుడు మనోజ్ ప్రీతమ్ (ఫైల్‌ఫొటో)

గోపాలపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన ఓ యువకుడు మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో శవమై తేలాడు. పురుషోత్తపురం ప్రాంతానికి చెందిన సబ్బిటి మనోజ్ ప్రీతమ్ (19) ఐటీఐ పూర్తి చేశాక ఖాళీగా ఉంటున్నాడు. అయితే ఈ నెల 17వ తేదీ రాత్రి మనోజ్ ఇంటి నుంచి బయటకు వెళ్లి మళ్లీ రాలేదు. అయితే తన మిత్రుల వద్ద ఉండి ఉంటాడని కుటుంబీకులు భావించారు. సోమవారం సాయంత్రం వరకు కూడా మనోజ్ ఇంటికి రాకపోవడంతో అదే రోజు రాత్రి తల్లి సునీత పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు యువకుడు అదృశ్యమైనట్టు కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో గుర్తించిన జలాశయ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. వారు మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా మనోజ్ ప్రీతమ్‌గా పోలీసులు గుర్తించి ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాగా మనోజ్ తన మిత్రుల వద్ద కొంత సొమ్ము అప్పుగా తీసుకున్నాడని, దానిని తిరిగి చెల్లించాలని మిత్రులు ఒత్తిడి చేయడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలినట్టు సమాచారం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కార్తీక మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మంగళవారం మురళీనగర్ రామాలయంలో ఉమా రామలింగేశ్వర స్వామికి రుద్రాక్షలతో అలంకరణ

'సెవెన్ హిల్స్ కార్మికుల అక్రమ తొలగింపులు ఆపాలి'

అక్కయ్యపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం సెవెన్‌హిల్స్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల అక్రమ తొలగింపులు ఆపి, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.రాజు కార్మికశాఖాధికారిని కోరారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని కార్మిక శాఖ కార్యాలయం ఎదుట మంగళవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. హెచ్ఆర్ మేనేజర్ కార్మికులను వేధించడం మానేసి, 15 రోజుల జీతం బకాయిలను అపరాధ రుసుముతో చెల్లించాలని రాజు డిమాండ్ చేశారు. ప్రస్తుత యాజమాన్యం వచ్చిన తర్వాత కార్మికులపై వేధింపులు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. బలవంతపు రాజీనామాలు, నోటీసులపై సంతకాలు చేయిస్తున్నారని, అలా అంగీకరించని కార్మికుల జీతాలు నిలిపివేస్తున్నారని విమర్శించారు. సంస్థకు నష్టాలు వస్తున్నాయని కుంటిసాకులు చెప్పి 38 మంది కార్మికులకు తొలగింపు నోటీసులు ఇచ్చారని పేర్కొన్నారు. 15 రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ యాజమాన్యం ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేస్తూ కార్మికులను మరిన్ని ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.నాయుడు, సీహెచ్ నూకరాజు, శ్రీను, వెంకటరావు, రమణమ్మ పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టుకు 27వ ర్యాంకు

... 5వ పేజీ తరువాయి

9.9 శాతం ఉన్నప్పటికీ మిగిలిన విమానాశ్రయాల్లో ఈ పెరుగుదల ఇంకా అధికంగా ఉండటంతో విశాఖ స్థానం తగ్గిపోయింది. పొరుగునే ఉన్న ఒడిశా రాజధాని భువనేశ్వర్ విమానాశ్రయం 46,00,615 మంది ప్రయాణికులతో 14వ స్థానం దక్కించుకుంది. భువనేశ్వర్ విమానాశ్రయం నుంచి అంతకుముందు ఏడాది 36,24,905 మంది ప్రయాణించారు. వార్షిక వృద్ధి రేటు అక్కడ 26.9 శాతం నమోదైంది. విశాఖ కంటే 1.7 రెట్లు అధికం.

- విజయవాడ విమానాశ్రయం 2023-24లో 10,62,506 మంది ప్రయాణికులతో 45వ స్థానం, తిరుపతి విమానాశ్రయం 8,70,662 మందితో 46వ స్థానం దక్కించుకున్నాయి. అన్ని విమానాశ్రయాల్లో 2023-24లో ప్రయాణికుల సంఖ్య పెరగగా, తిరుపతిలో అంతకు ముందు ఏడాది కంటే తక్కువ నమోదుకావడం గమనార్హం. 2022-23లోనే తిరుపతి నుంచి 9,19,267 మంది ప్రయాణించారు. ఆ తరువాత ఏడాది వారి సంఖ్య 48,605 తగ్గిపోయింది.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు చెక్

... 5వ పేజీ తరువాయి

జోన్-6 (గాజువాక) ప్రాంతాల్లో యూజీడీ అందుబాటులోకి తేవడంతోపాటు కోర్‌సిటీ పరిధిలో ప్రస్తుతం ఉన్న యూజీడీ నెట్‌వర్క్‌ను పెంచేందుకు పనులు జరుగుతున్నాయన్నారు. నగరంలో ఇప్పటికే లక్ష వరకూ యూజీడీ కనెక్షన్లు ఉండగా 95 వేల కనెక్షన్లకు వేర్వేరు కారణాలతో లబ్ధిదారులు ముందుకురావడం లేదన్నారు. నగరంలో 24 చోట్ల మురుగునీరు నేరుగా సముద్రంలో కలుస్తోందని, వాటిలో 14 పాయింట్లను డిసెంబరు నాటికి సమీపంలోని ఎస్టీపీలకు మళ్లించే పని పూర్తవుతుందన్నారు. శుద్ధిచేసిన నీటిని పరిశ్రమలకు విక్రయించడం ద్వారా ఏటా రూ.30 కోట్లు ఆదాయం సమకూరుతుందన్నారు. నగరంలో తాగునీరు కలుషితం కాకుండా ఉండేందుకు డ్రైనేజీలను క్రాస్ చేస్తున్న పైప్‌లైన్ పాయింట్లు 274 గుర్తించి వాటిని వేరే మార్గాల్లోకి మళ్లించామన్నారు. నీటి కాలుష్యం జరిగితే గుర్తించేందుకు వీలుగా ప్రతి రోజూ మూడుసార్లు నీటి శాంపిల్స్‌ను జీవీఎంసీ ల్యాబ్‌ల్లో పరీక్షిస్తున్నామన్నారు. నగరమంతటికీ నిరంతరం నీరు సరఫరా చేయాలంటే రూ.1,200 కోట్లు అవసరమవుతుందన్నారు. జీవీఎంసీ పరిధిలో వీధి దీపాల పనితీరును మెరుగుపరిచే చర్యలు ప్రారంభమయ్యాయని, లైటింగ్ తక్కువగా ఉంటుందనే ఫిర్యాదులు అందుతున్నందున 50 వేల స్తంభాలకు 70 వాట్స్ లైట్లను ఏర్పాటుచేసి లైటింగ్ పెంచుతామన్నారు. జీవీఎంసీ పరిధిలో 600 ఎకరాల విస్తీర్ణంలో 1200 ఓపెన్‌స్పేస్‌లు ఉన్నాయని వాటిలో 400 ఓపెన్‌స్పేస్‌లకు ఇప్పటికే కంచెలు ఉండగా మిగిలిన వాటికి రెండు వరుసల్లో మొక్కలునాటడం ద్వారా గ్రీన్ ఫెన్సింగ్ ఏర్పాటుచేస్తామన్నారు. అలాగే కాపులుప్పాడలో 22 ఎకరాల్లో మొక్కలు నాటుతున్నామన్నారు. దీనివల్ల జీవీఎంసీలో ప్రస్తుతం 28 శాతం ఉన్న పచ్చదనం 33 శాతానికి పెరుగుతుందన్నారు. అనధికార భవనాలను గుర్తించేందుకు వీలుగా డ్రోన్‌ల ద్వారా సర్వే చేసే ప్రతిపాదన ఉందన్నారు. వంద గజాల్లోపు నిర్మాణాలకు ప్లాన్ అవసరం లేదని రాష్ట్రప్రభుత్వం ప్రకటించిందని, దీనివల్ల చాలావరకూ ఫిర్యాదులు తగ్గిపోతాయని ఆశాభావం వ్యక్తంచేశారు.

సదరం.. సమస్యలు అనేకం

... 5వ పేజీ తరువాయి

ఉండే నాయకులు... తమను పెన్షన్ గురించి ఎవరైనా అడిగితే వైజాగ్‌లో ఫలానా ఆస్పత్రికి వెళ్లి సర్టిఫికెట్ తెచ్చుకుంటే వెంటనే ఇప్పించేస్తా అని చెబుతుండడం మరో కారణంగా తెలుస్తోంది. ఆస్పత్రుల్లో వైద్యులు సదరు దివ్యాంగులతో మాట్లాడినప్పుడు ఇదే విషయాన్ని చెబుతున్నారు. దీంతో వైద్యులు, అక్కడున్న సిబ్బంది సదరం సర్టిఫికెట్లు అందించే ప్రక్రియను, స్లాట్ బుక్ చేసే విధానాన్ని తెలియజేసి వారిని వెనక్కి పంపిస్తున్నారు.

దళారుల దందా

అనేక ప్రాంతాల్లో దళారులు దివ్యాంగుల అమాయకత్వాన్ని 'సొమ్ము' చేసుకుంటున్నారు. పెన్షన్ వచ్చేందుకు అవసరమైన సర్టిఫికెట్ మంజూరు చేయిస్తామని చెప్పి రూ.10 వేలు నుంచి రూ.20 వేలు వసూలు చేస్తున్నారు. నెలల తరబడి తిప్పుతూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నార తప్ప పని చేయడం లేదు. ఇటువంటి దళారుల బాధితులు ఎంతోమంది వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు.

స్లాట్ డేట్ మర్చిపోయి..

ఆన్‌లైన్‌లో ఖాళీ బట్టి నెల నుంచి రెండు నెలలు వ్యవధిలో స్లాట్ దొరుకుతుంది. అయితే, ఎంతోమంది తమకు ఆన్‌లైన్‌లో ఇచ్చిన స్లాట్ తేదీలను మర్చిపోతున్నారు. ఆ తేదీలు ముగిసిన తరువాత ఆస్పత్రులకు వస్తున్నారు. స్లాట్ కేటాయించినప్పుడు రాకపోతే తాము చేసేదేమీ ఉండదని వైద్యులు చెబుతున్నారు. దీంతో వైద్యులతో కొందరు వాదనకు దిగుతుంటారు.

పెన్షన్ సర్టిఫికెట్ ఇస్తారంటే వచ్చేశాం

షుగర్ వల్ల కాలికి ఇన్‌ఫెక్షన్ సోకింది. కరోనా సమయంలో కాళ్లు తీసేయాల్సి వచ్చింది. ఊర్లో ఉన్న వాళ్లు కేజీహెచ్‌కు వెళ్లి సర్టిఫికెట్ తెచ్చుకుంటే పెన్షన్‌కు పెడతామని చెప్పారు. దీంతో ఆదివారం బయలుదేరి వచ్చాం. రాత్రి ఒంటి గంట అయింది. రైల్వే స్టేషన్‌లో పడుకుని ఉదయాన్నే కేజీహెచ్‌కు వచ్చాం. ఓపీ తీసుకుని డాక్టర్ దగ్గరకు వెళ్లేసరికి 11 గంటలు అయింది. తీరా డాక్టర్‌ను సర్టిఫికెట్ ఇవ్వమంటే కుదరదన్నారు. ఆన్‌లైన్‌లో సదరం స్లాట్ బుక్ చేసుకుని రావాలని చెప్పారు. ఊళ్లో ఎవరూ ఈ విషయాన్ని చెప్పలేదు. అనేక ఇబ్బందులు పడి ఇక్కడకు వచ్చినా ఉపయోగం లేకుండా పోయింది. ఆస్పత్రి అంతా ఇలా చిన్నపాటి బల్లల సాయంతో తిరిగాను. వీల్ చైర్ అడిగితే డబ్బులు అడిగారు. డబ్బులు ఇచ్చే స్తోమత లేకపోవడంతో వీటి సాయంతోనే ఆస్పత్రి అంతా తిరిగాను. - రాయి సత్తిబాబు, మండపేట

వణికిస్తున్న జ్వరాలు

... 5వ పేజీ తరువాయి

చాలామంది జ్వర బాధితుల్లో బాడీ, జాయింట్ పెయిన్స్, తీవ్రమైన తలనొప్పి వంటి లక్షణాలు ఉంటున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు.

ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు: నగర పరిధిలో జ్వరపీడితులు పెరుగుతున్నారు. ఇంట్లో ఎవరో ఒకరూ జ్వర లక్షణాలతో బాధపడుతూ కనిపిస్తున్నారు. కేజీహెచ్, విమ్స్‌తోపాటు అర్బన్ హెల్త్ సెంటర్స్, ప్రైవేటు ఆస్ప త్రులకు జ్వర లక్షణాలతో ప్రతిరోజూ వందలాది మంది వస్తున్నారు. కేజీహెచ్, విమ్స్‌లకు ప్రతిరోజూ 50 మందికి తగ్గకుండా వస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

అప్పన్న భూముల వ్యవహారంపై 22న విచారణ

... 5వ పేజీ తరువాయి

మాన్సాస్ ట్రస్టు ఈఓగా పనిచేసిన కోడూరి రామచంద్రమోహన్ అవినీతికి పాల్పడ్డారని, చట్ట వ్యతిరేకంగా వందలాది ఎకరాల భూముల వివరాలను రికార్డుల నుంచి తొలగించారని ఆరోపణలు అందడంతో 2019లో వైసీపీ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని నియమించగా విచారణ జరిపి నివేదికను సమర్పించింది. దీనిపై విచారణకు హాజరుకావాలని కమిషనర్ ఆదేశించారు. పరిశీలించిన అంశాలు, వాస్తవాలు, నిజంగానే భూముల గోల్‌మాల్ జరిగిందా, అందుకు సంబంధించిన సాక్ష్యాలను సేకరించారా అనేదానిపై ఆరా తీస్తారని సమాచారం.

ఉక్కు ఉద్యమ కార్యాచరణ

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటుచేయాలని నిర్ణయించామన్నారు. 24న పాతగాజువాక నుంచి కొత్తగాజువాక వరకూ భారీ ర్యాలీ, సమావేశం, 27న ఉత్తరాంధ్ర మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామన్నారు. ఇక 28వ తేదీ ఉదయం ఎనిమిది నుంచి మరుసటిరోజు సాయంత్రం ఆరు గంటల వరకు (34 గంటలు) కూర్మన్నపాలెంలోని శిబిరంలో దీక్ష చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా ఉద్యమ కార్యాచరణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, కేఎస్ఎన్ రావు, వరసాల శ్రీనివాసరావు, జె.రామకృష్ణ, కారు రమణ, యు.రామస్వామి, అప్పారావు, విల్లా రామ్మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న ఆర్జిత సేవలు



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామికి పలు ఆర్జిత సేవలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాత ఆరాధనలను యథావిధిగా పూర్తి చేశాక భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కంకణ ధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ చేసి మంగళవాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణాన్ని జరిపారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న కర్ణాటక ఉన్నతాధికారులు

వరాహ లక్ష్మీనృసింహస్వామిని కర్ణాటక రాష్ట్ర ముఖ్య కార్యదర్శి వెంకయ్య, ఐఏఎస్ అధికారి కృష్ణంరాజు, ఐఆర్ఎస్ అధికారి మహాదేవ్, తదితరులు దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న ప్రసంగాలు



సమావేశంలో మాట్లాడుతున్న అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, చిత్రంలో ఇతర ప్రముఖులు

సీతంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల నేపథ్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన శతజయంతి సాహితీ మూర్తుల ప్రసంగ లహరి ఆకట్టుకుంది. అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 'కాళీపట్నం రామారావు కథల్లోని వాస్తవిక జీవిత చిత్రణ, కారా కథలు-సామాజిక వాస్తవికత' అనే అంశంపై అరసం కార్యదర్శి డాక్టర్ సి.ఎస్. క్షేత్రపాల్ రెడ్డి ప్రసంగించారు. ప్రముఖ విశ్లేషకులు డాక్టర్ డి.వి. సూర్యారావు మాట్లాడుతూ వజ్రాయుధం అభ్యుదయ కవితాకేతనం అన్నారు. సోమసుందర్ గొప్ప విమర్శకుడంటూ ఆయన గ్రంథాలను ప్రస్తావించారు. ప్రముఖ కవి శాఖ రాంభట్ల నృసింహ శర్మ ప్రసంగిస్తూ దాశరథి చలన చిత్ర గీతాలపై విశ్లేషణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.సుబ్బారావు, ఆచార్య వెలమల సిమ్మన్న, బసు పోతన, అరసం ప్రతినిధులు, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో విద్యార్థులకు పతకాలు



బాక్సింగ్: పతకాలు సాధించినవారిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ బోస్ తదితరులు

విశాఖపట్నం, స్పోర్ట్సు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంతర్ కళాశాలల పురుషులు, మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో గాయత్రి విద్యాపరిషత్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు పతకాలు సాధించారు. నగరంలో జరిగిన ఈ టోర్నీ పురుషుల విభాగంలో యు.రాకేష్ రోషన్ యాదవ్ రజత పతకం, ఎస్.హరీష్ కాంస్య పతకం సాధించగా మహిళల కేటగిరిలో కె.వాసవి, కె.రమ్యలత కాంస్య పతకాలు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా పతక విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కెఎస్.బోస్, డైరెక్టర్ ఆచార్య పి.మోహిని, ఫిజికల్ డైరెక్టర్ పి.కిషోర్‌కుమార్ అభినందించారు.

రైతుబజారులో అడ్డంగా సిమెంట్ రేకులు



నరసింహనగర్ రైతు బజారులో కుప్పగా వేసిన సిమెంటు రేకులు

అక్కయ్యపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతు బజారు ఆవరణలో పాత సిమెంట్ రేకులు కుప్పలుగా వేసి వదిలేశారు. దీని వల్ల బజారుకు వచ్చిన కొనుగోలుదారులు వాహనాలను నిలపడానికి సౌకర్యంగా లేదు. కొన్ని నెలల క్రితం రైతుబజారులోని స్టాల్స్‌పై ఉన్న సిమెంట్ రేకులు తొలగించి కొత్తగా ఇనుప రేకులు వేశారు. ఆ పాత రేకులను అక్కడే ఖాళీ స్థలంలో కుప్పగా వేశారు. అవి అడ్డుగా ఉండడంతో రైతుబజారుకు వచ్చే కొనుగోలుదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేద్దామంటే వీలు కుదరకపోవడంతో ఎక్కడబడితే అక్కడ అడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. మిగతా వారు లోపలకు రావాలన్నా, బయటకు వెళ్లాలన్నా అవస్థలు పడుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన రైతులు వారికి కేటాయించిన స్టాళ్లలో కాకుండా ఖాళీగా ఉన్న స్థలంలో అరటి గెలలు, ఇతర సామగ్రి పెట్టేశారు. దీనివల్ల కూడా అందరూ ఇబ్బంది పడుతున్నారు. రైతులకు కేటాయించిన స్టాళ్లలో కాకుండా ఖాళీ స్థలంలో పెట్టడం వల్ల తమకు అసౌకర్యంటా ఉంటోందని కొనుగోలుదారులు చెబుతున్నారు. ఈ విషయంపై రైతుబజారు ఎస్టేట్ అధికారి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మందుబాబులకు అడ్డాగా పాఠశాల భవనం

అంగన్‌వాడీ పాత భవనానిది అదే పరిస్థితి

పగటి పూట పేకాట, అష్టాచమ్మాలకు కేంద్రంగా..

రాత్రయ్యేసరికి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయని స్థానికుల ఆవేదన



నాతయ్యపాలెంలో మూతపడిన ప్రాథమిక పాఠశాల భవనం, అంగన్‌వాడీ కేంద్రం

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన నాతయ్యపాలెంలోని ప్రాథమిక పాఠశాల భవ నంతో పాటు అంగన్‌వాడీ కేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో మందుబాబులకు అసాంఘిక కార్యక లాపాలకు అడ్డాగా మారాయి. దీంతో సాయంత్రమయ్యే సరికి ఆయా పరిసర ప్రాంతాల మీదుగా రాకపోకలు సాగించడం ఇబ్బంది కరంగా ఉంటుందని పలువురు మహిళలు, యువతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

69వ వార్డు పరిధి నాతయ్యపాలెం ప్రధాన రహదారిలో 1984లో ప్రాథమిక పాఠశాల భవనాన్ని నిర్మించారు. సుమారు 500 గజాల విస్తీర్ణంలో రెండు భవనాలను నిర్మించగా, ఇందులో ఒకటి ప్రాథమిక పాఠశాలకు,మరొక దానిని అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించారు. కాలక్రమేణ ఈ భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో 2010లో బంగారమ్మ ఆలయం వద్ద మరో భవనాన్ని నిర్మించి పాఠశాలను అక్కడకు తరలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని మాత్రం 2018 వరకు ఇక్కడే నిర్వహించారు. అయితే భవనం కూలిపోయే స్థితికి చేరడంతో దీనిని కాలనీ మధ్యలో ఉన్న కళావేదిక (స్టేజి)పైకి మార్చారు. అయితే రానురాను అంగన్‌వాడీకి వచ్చే పిల్లల సంఖ్య పెరగడంతో ఈ కాలనీలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రెండు అంగన్‌వాడీ కేంద్రాలు పాత పంచాయతీ కార్యాలయం వద్ద గల కళావేదికపై, మరో కేంద్రాన్ని బంగారమ్మ ఆలయ ప్రాంగణంలో గల కళావేదికపై నిర్వహిస్తున్నారు. ఎండ, వానలో సమయంలోనూ పిల్లలను కళావేదికపై వున్న చిన్న గదుల్లోనే ఉంచాల్సి వస్తుండడంతో వారితో పాటు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వర్షాల సమయంలో తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపేందుకు తల్లిదండ్రులు వెనకడుగు వేస్తున్నారు. కాగా శిథిలమైన పాఠశాలతో పాటు పాత అంగన్‌వాడీ భవనం గురించి పట్టించుకునే వారే కరువవ్వడంతో వీటిని పలువురు ఆయతాయిలు, మందుబాబులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడకు వచ్చి కొందరు గంజాయి సేవించడమే కాకుండా ఒక్కోసారి వాగ్వాదాలకు దిగుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ భవనాల గురించి పట్టించుకునే నాథులే కరువవ్వడంతో ఉదయం నుంచే ఇక్కడ పేకాటతో పాటు అష్టాచమ్మ ఆడుతున్నారు. చీకటి పడేసరికి గంజాయి బ్యాచ్‌లు, మందుబాబులు గుంపులుగా చేరుతుండడంతో ఈ భవనాలు బార్‌లుగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

అర్ధరాత్రి వేళల్లో కొందరు ఇతర అసాంఘిక కార్యక్రమాలకు వినియోగిస్తున్నారని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ పాఠశాల స్థలంపై కొంతమంది కబ్జాదారులు కన్నేశారు. అందువల్ల అధికారులు స్పందించి ఆకతాయిలు, మందుబాబుల ఆగడాలకు కళ్లెం వేయడంతో పాటు విలువైన ఈ స్థలాన్ని కాపాడాలని కోరుతున్నారు. శిథిల భవనాల స్థానంలో అంగన్‌వాడీ కేంద్రంతో పాటు సామాజిక భవనాన్ని నిర్మించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఎంపీకి సమస్యలను వివరిస్తున్న ప్రతినిధులు

ఎంపీ శ్రీభరత్‌ను కలిసిన స్టీల్ ప్లాంట్ త్రిఫ్ట్ సొసైటీ ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల నుంచి యాజమాన్యం చేసిన త్రిఫ్ట్ రికవరీలను చెల్లించక పోవడం వల్ల తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ సొసైటీ ప్రతినిధులు ఎంపీ శ్రీభరత్‌ను మంగళవారం కలిసి వివరించారు.

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు ఉద్యోగుల నుంచి రికవరీ బకాయిలు రూ.78.57 కోట్లు అని, ఈ చెల్లింపులు చేయక పోవడం వల్ల పదవీ విమరణ చేసిన ఉద్యోగులకు, పొదుపు చేసుకున్న వారికి తాము చెల్లింపులు చేయని పరిస్థితి నెలకొం దన్నారు. ఉక్కు యాజమాన్యంతో మాట్లాడి ఈ సమస్యను పరిష్కరించాలని వారు ఎంపీని కోరారు. శ్రీభరత్‌ను కలిసిన వారిలో సొసైటీ ఉపాధ్యక్షుడు కె.ఆనంద్‌కుమార్, కార్యదర్శి డి.శ్రీరామచంద్రమూర్తి ఉన్నారు.

విద్యార్థులకు ప్రసాదం పంపిణీ

మల్కాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని బౌద్ధ మతస్తులు మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో మంగళవారం క్షీర ప్రసాదాన్ని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలోని గౌతమ బుద్ధుని విగ్రహం వద్ద ప్రార్థన చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బాంతిజీ దమానంద మాట్లాడుతూ బుద్ధుని బోధనలను విద్యార్థులంతా ఆచరించాలన్నారు. కార్యక్రమంలో బౌద్ధీయులు కె.లక్ష్మీనారాయణ, రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కంగువా :** సంగం, జగదాంబ, మెలోడి, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **మట్కా :** శరత్, శారద, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** లిఖిత (శ్రీహరిపురం)
- **క :** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :** రమాదేవి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 28, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 18, పచ్చిమిర్చి 32, కాకరకాయల 40, బీరకాయలు 38, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 30, క్యారెట్ 64 దొండకాయలు 32, బంగాళదుంపలు 40, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది)50, మునక్కాడలు (కిలో) 74, బరబాటి 30, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 36, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్(పెన్సిల్) 55, పొటల్స్ 52, కీరదోస 24, క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపల 32, కంద 66, దేముడు చిక్కుడు 82, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, క్యాప్సికం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, బూడిద గుమ్మడికాయ 30, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	95
ఫారం ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210



యారాడ వాసులకు వంట గ్యాస్ ఇక్కట్లు

మల్కాపురంలో ఉన్న గ్రామస్తుల హెచ్‌పీ గ్యాస్ కనెక్షన్లను పెదగంట్యాడకు మార్చిన హెచ్‌పీసీఎల్ మార్కెటింగ్ అధికారులు

పెదగంట్యాడ నుంచి యారాడకు సిలిండర్లను సరఫరా చేయబోమంటున్న బాయ్‌లు

యథావిధిగా జ్యోతి గ్యాస్ ఏజెన్సీ ద్వారానే సరఫరా చేయాలని గ్రామస్తుల వేడుకోలు

మల్కాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): యారాడ గ్రామస్తులకు వంట గ్యాస్ ఏజెన్సీ దూరమవ్వడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ గ్రామంలో హెచ్‌పీ గ్యాస్ కనెక్షన్లు సుమారు వెయ్యి ఉన్నాయి. ఇవన్నీ మల్కాపురంలో ఉన్న జ్యోతి గ్యాస్ ఏజెన్సీకి అనుసంధానమై ఉన్నాయి. అయితే ఇటీవల పెదగంట్యాడ ప్రాంతంలో రత్న గ్యాస్ ఏజెన్సీని హెచ్‌పీసీఎల్ మార్కెటింగ్ విభాగం అధికారులు ప్రారంభించి, దానిని ప్రోత్సహించేందుకు గాను యారాడలోని అన్ని గ్యాస్ కనెక్షన్‌లను జ్యోతి గ్యాస్ ఏజెన్సీ నుంచి రత్న గ్యాస్ ఏజెన్సీకి బదలాయించారు. అయితే గ్రామస్తులకు సమాచారం ఇవ్వకుండా వారి కనెక్షన్లను బదిలీ చేశారు. అప్పటి నుంచి యారాడ గ్రామస్తులకు గ్యాస్ ఇబ్బందులు మొదలయ్యాయి. సమీపాన ఉన్న జ్యోతి గ్యాస్ ఏజెన్సీ ద్వారా సమయానికి సిలెండర్లను బాయ్‌లు యారాడకు సరఫరా చేసేవారు. ఇప్పుడు పెదగంట్యాడ నుంచి యారాడకు సిలిండర్లను తీసుకువచ్చేందుకు బాయ్స్ ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో గ్యాస్ సిలిండర్ల కోసం గ్రామస్తులు నానాపాట్లు పడుతున్నారు. పెదగంట్యాడలో గ్యాస్ ఏజెన్సీ ఉంటే.. అందుకు సంబంధించిన గొడౌన్ సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడ నుంచి సిలెండర్లను తీసుకుని యారాడ వచ్చి వెళ్లేందుకు దాదాపు 70, 80 కిలోమీటర్ల దూరం ఉంటుందని డెలివరీ బాయ్‌లు పేర్కొంటున్నారు. అంత దూరం తాము గ్యాస్ సిలిండర్లను సరఫరా చేయలేమని వారంటున్నారు. దీంతో పలువురు గ్రామస్తులు తమ సమస్యను టీడీపీ యారాడ ఇన్‌చార్జి తొత్తరి శ్రీనివాస్ (చిట్టి) దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఈ సమస్యను గాజువాక టీడీపీ నాయకుల దృష్టికి తీసుకువెళ్లి, రత్న గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు. తాము సిలిండర్లను పంపేందుకు సిద్ధంగా ఉన్నా, తీసుకు వెళ్లేందుకు డెలివరీ బాయ్‌లు యారాడ వెళ్లలేమని చెబుతున్నారని పేర్కొన్నారు. అందువల్ల తమ గ్యాస్ కనెక్షన్లను తిరిగి జ్యోతి గ్యాస్ ఏజెన్సీకి మార్చాలని యారాడ వాసులు కోరుతున్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టాలి

పన్నుల వసూళ్లలో అలసత్వం వహిస్తే చర్యలు

జోన్ సమీక్ష సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ సంపత్‌కుమార్



గాజువాక జోన్ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సంపత్‌కుమార్

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ గాజువాక జోన్ పరిధిలో అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు అధికారులు, వార్డు కార్యదర్శులు కృషి చేయాలని కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు. షీలానగర్‌లో మంగళవారం నిర్వహించిన గాజువాక జోన్ సమీక్ష సమావేశంలో ఆయన అధికారులు, వార్డు కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. జోన్ పరిధిలో ఉన్న 19 వార్డుల్లో నెలకొన్న సమస్యలపై ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించా లన్నారు. అవే సమస్యలపై ప్రజల నుంచి పలుమార్లు ఫిర్యాదులు రాకూడదని స్పష్టం చేశారు. రోడ్లు, కాలువలను అభివృద్ధి చేయడతో పాటు వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. గాజువాకలో అనధికార నిర్మాణాలపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని, అటువంటి వాటిపై దృష్టి సారించాలని ఆదేశించారు. పన్నుల వసూళ్లలో అలసత్వం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. సమావేశంలో చీఫ్ ఇంజనీర్ పి.శివప్రసాద్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేశ్‌కుమార్, చీఫ్ సిటీ ప్లానర్ మీనాకుమారి, జెడ్సీ పి.శేషాద్రి, అధికారులు గోవిందరావు, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

గాజువాక లైబ్రేరియన్ చంద్రకళ

పలుచోట్ల ఇందిరమ్మకు నివాళి



గాజువాక శాఖా గ్రంథాలయంలో ఇందిరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చంద్రకళ, తదితరులు

గాజువాక, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులందరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గాజువాక లైబ్రేరియన్ బి.చంద్రకళ అన్నారు. ఇక్కడి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. తొలుత ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పలుచోట్ల ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. గ్రంథాలయాధికారి, గ్రంథాలయ కమిటీ సభ్యులు, పాఠకులు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లైబ్రేరియన్ ఎన్‌వీ నరసింహం మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో చెరగని ముద్రవేసిన ఇందిరాగాంధీని నేటి తరం మహిళలు స్ఫూర్తిగా తీసుకో వాలని కోరారు.

పెదగంట్యాడ: దేశ రాజకీయాలను శాసించిన ధీర వనిత మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ అని కార్పొరేటర్ పులా లక్ష్మీబాయి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక లైబ్రరీలో ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ మహిళల పట్టుదలకు, త్యాగానికి ఇందిరమ్మ ఒక ఉదాహరణగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పీవీ రమణ, ఉపాధ్యాయులు జీపీ నాయుడు, మనోహర్ అలీ,తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అలాగే చిత్రలేఖనం పోటీల విజేతలకు అయ్యన్నపాలెం సంక్షేమ సంఘం అధ్యక్షుడు మొల్లి వెంకటేశ్ నగదు బహుమతులను అందజేశారు.

మల్కాపురం: సమస్యల పరిష్కారం కోసం మహిళలంతా సంఘటితమై ఉద్యమాలను కొనసాగించాలని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలంతా అన్ని రంగాలతో పాటు రాజకీయాల్లోనూ చురుగ్గా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అరుణకుమారి, త్రినాథపురం పాఠశాల హెచ్‌ఎం రమణకుమారి, గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్, కవి సత్తిరాజు, తదితరులు పాల్గొన్నారు.

పెంటమాంబ ఆలయంలో జ్యోతిర్లింగార్చన

పెదగంట్యాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నెల్లిముక్కు పెంటమాంబ ఆలయంలో మంగళవారం జ్యోతిర్లింగార్చనతో పాటు పలు పూజాది కార్యక్రమాలను చేపట్టారు. నెల్లిముక్కు, అయ్యన్నపాలెం, మొల్లివానిపాలెం, కోరాడ, బాలచెరువు ప్రాంతాలకు చెందిన భక్తులు జ్యోతిర్లింగార్చనలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పులి వెంకటరమణారెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, కేఎన్ రెడ్డి, పిట్టా కుంచారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష బిల్వపత్ర పూజ

గాజువాక: పరమశివుని జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని మంగళవారం వినాయకనగర్ వుడా కాలనీలోని శ్రీకాశీవిశాలాక్షి విశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి బారులుతీరారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య లక్ష బిల్వపత్ర పూజ నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టగా, సాయంత్రం భారీ ఎత్తున హోమం జరిపారు.

కణితిలో సామూహిక రుద్రాభిషేకాలు

కూర్మన్నపాలెం: కార్తీక మాస ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని 87 వార్డు కణితి పద్మశాలి వీధిలో శ్రీఉమా మార్కండేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు సామూహిక మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలను నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఎస్.సత్యం, ఉమ, కోసూరి పెంటారావు, కాకి ఈశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

అగనంపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని 85వ వార్డు పరిధి చట్టివానిపాలెం లైబ్రరీకి మంగళవారం ఉక్కు విశ్రాంతి జీఎం దువ్వాడ రాంప్రసాద్ వివిధ రకాల విజ్ఞాన పుస్తకాలను వితరణగా అందజేశారు. విజ్ఞానానికి, మానసిక వికాసానికి గ్రంథాలయలు ఎంతగానో దోహదపడతాయన్నారు. యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బి.సత్యనారాయణ, మొల్లి కోటేశ్వరరావు, టీకే రామకోటి, దేముడు, అప్పలరాజు, గోవింద్, బంగార్రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి నివాళి

గాజువాక, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాన మంత్రి దివంగత ఇందిరా గాంధీ జయంతిని మంగళవారం పాత గాజువాకలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి ఇంటక్ తెలుగు రాష్ట్రాల ఉపాధ్యక్షుడు జెర్రిపోతుల ముత్యాలు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వీరారావు, అప్పారావు, వీరుబాబు, ఎస్.అప్పారావు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

తిరుమల నగర్ కాలనీకి మరో అవార్డు

కూర్మన్నపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ జలశక్తి అవార్డు అందుకున్న నెల రోజుల వ్యవధిలోనే మరో అవార్డును 87వ వార్డు పరిధిలోని తిరుమల నగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అందుకుంది. హైదరాబాదులోని గచ్చిబౌలిలో మంగళవారం జరిగిన ఇంజనీర్స్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా జాతీయ సమావేశంలో తిరుమల నగర్ కాలనీకి అవార్డును అందజేశారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తదితర ప్రముఖుల చేతుల మీదుగా కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందంలు అందుకున్నారు.

పాఠశాలలను విలీనం చేయాలని వినతి

అగనంపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీలో గల పలు పాఠశాలలను అనకాపల్లి జిల్లా నుంచి విశాఖలోకి విలీనం చేయాలని కోరుతూ డీఈవో జి.అప్పారావునాయుడును ప్రజా సంఘాల నాయకులు మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. లేమర్తి, పినమడక జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు అగనంపూడి ప్రాంతంలో మరో ఏడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు అనకాపల్లి జిల్లా పరిధిలో ఉన్నాయన్నారు. వీటిని విశాఖ జిల్లాలో విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. డీఈవోను కలిసిన వారిలో నాయకులు మోటూరి వెంకటరమణ, బి.అప్పారావు, బండారు చందూరమేశ్, హనుమంతురావు, తదితరులు ఉన్నారు.

టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు: కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

అగనంపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంటుందని, అందువల్ల అందరూ యువతంతా పార్టీ సభ్యత్వం తీసుకోవాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పేర్కొన్నారు. గంగిరెడ్ల కాలనీలో మంగళవారం ఏర్పాటు చేసిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజా సంక్షేమంతో పాటు యువతకు ఉపాధి, ఉద్యోతావకాశాల కోసం సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారన్నారు.



రామారావు మృతదేహానికి పూలమాల వేస్తున్న హరేంధిర ప్రసాద్

అవయవ దానంపై అవగాహన ఉండాలి

కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అవయవ దానం పట్ల ప్రజలందరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ కోరారు. ఈ నెల 17న దువ్వాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వాసిరెడ్డి రామారావు (57) అనే వ్యక్తి సోమవారం బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు ప్రకటించడంతో ఆయన అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఈ నేపథ్యంలో రామారావు మృతదేహానికి మంగళవారం కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అవయవ దానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులను అభినందించి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున పది వేలను అందజేశారు. ఈ సందర్భంగా షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ అవయవ దానం ద్వారా నలుగురి జీవితాల్లో వెలుగులు నింపవచ్చన్నారు. రాష్ట్రంలో సుమారు నాలుగు వేల మంది వివిధ అవయవాల కోసం ఎదురుచూస్తున్నారని, అందువల్ల ఆప్తులను కోల్పోయినప్పుడు సంబంధిత కుటుంబ సభ్యులు ధైర్యం తెచ్చుకుని మృతుని అవయవాలను దానం చేసి నలుగురి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. కార్యక్రమంలో జీవన్‌దాన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు, పలువురు వైద్యులు పాల్గొన్నారు. కాగా రామారావు నుంచి సేకరించిన ఊపిరితిత్తులు, గుండె, కిడ్నీ అవయవాలను గ్రీన్ చానల్ ద్వారా వివిధ ప్రాంతాలకు తరలించినట్టు ట్రస్టు సభ్యులు పేర్కొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి అంబలం పూజ



పూజలో పాల్గొన్న అయ్యప్ప స్వామి భక్తులు

కూర్మన్నపాలెం,నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కూర్మన్నపాలెంలో మంగళవారం అయ్యప్పస్వామి అంబలం పూజను కన్నులపండువగా నిర్వహించారు. ఇందులో భాగంగా మాలధారణ చేసిన భక్తులు ఆలపించిన భజన పాటలు అందరినీ అలరించాయి. శ్రీస్వామి అయ్యప్ప సేవా సంఘం గురుస్వామి అదపాక వెంకటరమణ, పొన్నాడ వాసుదేవరావు గురుస్వామి పర్యవేక్షణలో స్వామివారి ఉత్సవ విగ్రహానికి అష్టోత్తర శతనామాలతో పంచామృతాభిషేకాలు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు,భజన గీతాల నడుమ స్వామివారిని ఊరేగించారు. అనంతరం పద్దెనిమిది మెట్లను దీపాలతో శోభాయమానంగా అలంకరించి పూజలు జరిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ విచ్చేసి అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు గురుస్వాములను బొండా జగన్ చేతుల మీదుగా సత్కరించారు. అనంతరం సద్ది ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు డీవీ అప్పారావు, స్కూల్ ప్రిన్సిపాల్ లలితకుమారి, నాగుల రవికుమార్, సంతోశ్, జిప్సా భాస్కర్, మురళి, శివ, గిరీశ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలానికి అయ్యప్ప భక్తుల పాదయాత్ర

వేపగుంట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్ఆర్‌వీపురం సమీపంలోని పవర్ ఆఫీస్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన అయ్యప్ప పీఠం ఆధ్వర్యంలో మాలధారణ చేసిన భక్తులంతా మంగళవారం ఉదయం సింహాచలం కొండకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. గురుస్వామి పార్థు ఆధ్వర్యంలో ప్రహ్లాదపురం బీఆర్‌టీఎస్ రోడ్డు మీదుగా సింహగిరికి మెట్ల మార్గం గుండా చేరుకున్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి భక్తి గీతాలను ఆలపించారు. ఏటా తమ పీఠం ఆధ్వర్యంలో సింహాద్రి అప్పన్నను దర్శించేందుకు పాదయాత్ర చేపట్టడం ఆనవాయితీగా వస్తుందని గురుస్వామి పేర్కొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించండి: జెడ్సీ

వేపగుంట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ వేపగుంట జోనల్ కార్యాలయంలోని అన్ని విభాగాల సిబ్బందికి మంగళవారం ప్లాసిక్ వినియోగాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. జెడ్సీ కె.హైమావతి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం నిరోధానికి ప్రతి ఉద్యోగి కుటుంబ సభ్యులు కృషి చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. అందరూ పర్యావరణ హితమైన క్లాత్, పేపర్ బ్యాగులను వాడాలన్నారు. అనంతరం ఉద్యోగులందరికీ ఆయా బ్యాగ్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో బండారు అప్పలనాయుడు, శానిటరీ సూపర్‌వైజర్ ఎస్‌వీ రమణ, సూపరిటెండెంట్ పీవీఎస్ఎన్‌మూర్తి, ఆర్‌వో నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

'సీపీఐ సభను విజయవంతం చేయాలి'

సింధియా, నవంబరు 19, (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 24న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరగనున్న బహిరంగ సభను ప్రజలంతా విజయవంతం చేయవలసిందిగా ఏఐటీయూసీ కార్యవర్గ సభ్యుడు కాద్రేంగుల సత్యాంజనేయ కోరారు. 63వ వార్డు పరిధి కాకరలోవ భగత్‌సింగ్ కూడలిలో మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన వాల్ పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయాని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాంబాబు, కనకేశ్వరరావు, త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో సీజీఆర్ఎఫ్ పాత్ర కీలకం

మల్కాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడంలో సంబంధిత న్యాయస్థానం ఎంతో కీలకంగా వ్యవహరిస్తుందని సీజీఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ అన్నారు. మల్కాపురం సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ వినియోగదారుల సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు నిర్వహించిన సదస్సుల ద్వారా 8,241 సమస్యలను పరిష్కరించామన్నారు. ముఖ్యంగా విద్యుత్ బిల్లులు ఎక్కువ రావడం, మీటర్లు జోరుగా తిరగడం వంటి అనేక సమస్యలను పరిష్కరించడంలో ఈ సదస్సులు ఎంతో ఉపయుక్తంగా ఉంటున్నాయన్నారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ సభ్యుడు షేక్ బాబర్, ఈపీడీసీఎల్ జోన్-2 అధికారులు బీకే నాయుడు, ఎం.ధర్మరాజు, మల్కాపురం ఏడీఈ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

అమెరికా వీసా దరఖాస్తుపై అవగాహన

అగనంపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ కళాశాలలో బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు అమెరికా వీసా దరఖాస్తు ప్రక్రియపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిప్యూటీ కాన్సులర్ ఇన్ఫర్మేషన్ యూనిట్ చీఫ్ ఎస్.జెన్ని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అప్లికేషన్ డాక్యుమెంటేషన్, ఇంటర్వ్యూలో అనుసరించాల్సిన విధి విధానాలను వివరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి ఐశ్వర్య రావత్, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ మధుసూదనరావు, మురళీకృష్ణ, శ్యాంప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సీమంతాలు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సత్యసాయి మందిరంలో భగవాన్ సత్యసాయి 99వ జన్మదినాన్ని మంగళవారం శక్తి స్వరూపిణి దినోత్సవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశపాత్రునిపాలెం, అగనంపూడి పరసర ప్రాంతాలకు చెందిన గర్భిణులకు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సీమంతాలు చేశారు. తొలుత మందిరంలో హనుమాన్ చాలీసా, పారాయణాన్ని పఠించారు. సేవే పరమవధిగా సమితి ముందుకు సాగుతుందని సమితి కన్వీనర్ జి.రామకృష్ణ తెలిపారు.

కలువల సృష్టికర్త!

అనేక వర్ణాలతో సరికొత్త పూలు

100 రకాల కలువ మొక్కలకు ప్రాణం



వివిధ రంగుల్లో కలువలు



అతనికి కలువ పూలు అంటే అమిత ప్రేమ. చిన్నప్పటి నుంచీ వివిధ ప్రాంతాల్లో కనిపించే కలువులు, తామరలను దగ్గరగా పరిశీలించేవారు. కేవలం మూడు నాలుగు రంగుల్లోనే లభిస్తుండడం అతనిని ఆలోచింపజేసింది. కలువ మొక్కకు అంటుకట్టి హైబ్రిడ్ పద్ధతిలో కొత్త జన్యువును సృష్టిస్తే మరిన్ని వర్ణాలతో అందమైన పూలను పూయించవచ్చని భావించారు. అంతే తనకు వచ్చిన ఆలోచనను ఆచరణలో పెట్టి ప్రస్తుతం వంద రకాల కలువలు, తామరలకు జీవం పోశారు.

- మధురవాడ, ఆంధ్రజ్యోతి





ఒకప్పుడు గ్రామాల్లోని చెరువులు, కోనేరుల్లో కనిపించే కలువలు, తామరలు ప్రస్తుతం పట్టణాల్లో మిద్దెపై సాక్షాత్కరిస్తున్నాయి. దేవతల పుష్పాలుగా పేర్గాంచిన ఈ పూలు ఆకర్షణీయ రంగులతో అలరిస్తుంటాయి. మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. ఇవి సాధారణంగా ఎరుపు, నీలం, తెలుపు వర్ణాల్లోనే కనిపిస్తుంటాయి.. కానీ ఈ మొక్కలను ఎంపిక చేసుకొని అంటుకట్టే (హైబ్రీడ్) పద్ధతిలో సరికొత్త రంగుల్లో కలువులు పూయిస్తున్నారు మధురవాడ జీసీసీ లేఅవుట్‌కు చెందిన అనలేందు రాయ్. కలువల్లో నూతన మొక్కలను సృష్టించే వారిని ఆంగ్లంలో హైబ్రీడైజర్ అంటారు.

పశ్చిమబెంగాల్‌కు చెందిన రాయ్ బతుకుతెరువు కోసం ఏళ్ల కిందట నగరానికి వచ్చారు. మధురవాడ జీసీసీ లేఅవుట్‌లో స్థిరనివాసం నిర్మించుకుని, ఓ పాఠశాలను నిర్వహిస్తున్నారు. చిన్నప్పటి నుంచి తాను ఎంతగానో ముచ్చటపడే కలువ మొక్కలను పెంచడాన్ని హాబీగా చేసుకున్నారు. జీసీసీ లేఅవుట్ గ్రౌండ్‌ఫ్లోర్‌లో నివసిస్తున్న రాయ్ పైఅంతస్థులో టెర్రస్‌పై పెద్దపెద్ద ప్లాస్టిక్ తొట్టెల్లో వివిధ రకాల కలువలు, తామర పూల మొక్కలు పెంచుతున్నారు. వీటితో పాటు పదుల సంఖ్యలో వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలను కూడా పెంచుతున్నారు.

విదేశాల నుంచి మొక్కలు..

రాయ్ తనకున్న ఆసక్తితో మన దేశంలో లభించే మొక్కలతో పాటు వివిధ దేశాల నుంచి కలువ, తామర పూల మొక్కలు తెప్పించారు. వాటిని హైబ్రీడైజ్ చేసి కొత్త రంగుల పూలను సృష్టించారు. ఈ పూలకు పేర్లను కూడా ఆయనే పెడుతుంటారు. ప్రస్తుతం ఇతని వద్ద మన-999, ప్రణవ్-9, వసంత్-9, నిర్భయ-9 తదితర 100 రకాల సంకరజాతి మొక్కలున్నాయి. వీటిలో కొన్నింటిని విదేశాలకు కూడా ఎగుమతి చేశారు.

- ▸▸ విదేశీ హైబ్రీడైజర్‌లతో పరిచయం
- ▸▸ మధురవాడకు చెందిన అనలేందు రాయ్ ఘనత

విదేశీ హైబ్రీడైజర్లతో పరిచయం..

ఈ రంగంలో రాయ్‌కు ఉన్న ఆసక్తి విదేశీ హైబ్రీడైజర్లతో పరిచయం పెంచుకునేలా చేసింది. థాయ్‌లాండ్‌కు చెందిన నోష్ చయ్‌చాన్‌శిల్ప, అమెరికాకు చెందిన రిచ్‌శేచర్, జర్మనీకి చెందిన వాసుమనికమ్ తదితరులతో ఏర్పడిన పరిచయం మొక్కల హైబ్రీడైజర్‌కు సాయపడింది. ఆయా దేశాల్లో లభించే అరుదైన, రంగు, సువాసన, వివిధ రకాల వినూత్న పత్రాలతో ఉండే కలువలు, తామర మొక్కలను రాయ్ ఇక్కడికి తెప్పించారు. ఇక్కడ లభించే కొన్ని సంకరజాతి మొక్కలను ఆయా దేశాలకు పంపించారు. రాయ్ టెర్రస్‌పై ఆస్ట్రేలియా, అమెరికాకు చెందిన వాటర్‌లిల్లీ, లోటస్‌లు కూడా ఉన్నాయి.

కలువలంటే ప్రాణం..



ఎంతో సుకుమారంగా ఉండే కలువలు, తామరపూలంటే ఇష్టం.. వాటిని ఇంటిపైనే కుండీల్లో పెంచుతున్నాను. రోజుకు నాలుగు గంటలు ఈ మొక్కల సంరక్షణకు కేటాయిస్తున్నాను. పురుగులు, తెగుళ్ల సోకకుండా చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. వివిధ దేశాల్లోని 25 మంది హైబ్రీడైజర్లలో ఒకడిగా ఉండడం ఆనందం. సంకరజాతి కలువలు, తామరపూలు సృష్టించడంలో వివిధ మాధ్యమాల నుంచి సమాచారం సేకరిస్తుంటాను. అంతర్జాతీయ సదస్సులు, వర్క్‌షాప్‌లకు హాజరవుతుంటాను. ఎక్కడి నుంచైనా కొత్త విషయాలు గ్రహిస్తే వాటిని ముందుగా మా ఇంట్లో పెంచే కలువల పైనే ప్రయోగిస్తాను. ప్రస్తుతం నా వద్ద 100 రకాల కలువలు, తామర పూలు పూసే మొక్కలున్నాయి. భవిష్యత్తులో మరికొన్ని రకాలు సృష్టిస్తాను.

- అనలేందు రాయ్, హైబ్రీడైజర్

ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల సంఖ్య పెరగాలి

- ▸▸ రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం దేశానికే మార్గదర్శకం
- ▸▸ కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి డాక్టర్ దేవేష్ చతుర్వేది



భీమిలి మండలం మజ్జిపేటలో జీవామృతం తయారీని పరిశీలిస్తున్న దక్షిణాది రాష్ట్రాల అధికారులు

విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు దేశానికే మార్గదర్శకంగా నిలిచాయని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ దేవేష్ చతుర్వేది పేర్కొన్నారు. రాడిసన్ బ్లూ హోటల్‌లో నిర్వహిస్తున్న దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ సదస్సులో మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల సంఖ్య మరింత పెరగాలని, ఇందుకు ప్రభుత్వం సహకారాన్ని అందించాలన్నారు. ఈ బాధ్యత వ్యవసాయ శాఖ అధికారులపైనే ఉందన్నారు. సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేయడం వల్ల రైతులకు ఖర్చు తగ్గడంతోపాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే అవకాశం ఉందన్నారు. అనంతరం దక్షిణాది రాష్ట్రాల నుంచి వచ్చిన అధికారులు మూడు బృందాలుగా విడిపోయి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఒక బృందం భీమునిపట్నం మండలం మజ్జిపేట, కోరాడ గ్రామాలను సందర్శించింది. మజ్జిపేటలో ఆడారి కిశోర్‌కుమార్, ఇతర రైతులు 8.2 ఎకరాల్లో సాగు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని, ఒకటిన్నర ఎకరాల విస్తీర్ణంలో జీవామృతం తయారీ విధానాన్ని సందర్శించింది. రైతులు అవలంబిస్తున్న సేంద్రియ వ్యవసాయ విధానాలను ప్రభుత్వ సలహాదారు (వ్యవసాయం-సేంద్రియ సాగు విధానాలు) రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ బృందానికి వివరించారు. మరో బృందం పద్మనాభం మండలం కోరాడ గ్రామంలో వై.పార్వతి మరికొద్దిమంది రైతులతో కలిసి సాగు చేస్తున్న వరి కాంపాక్ట్ బ్లాక్‌ను సందర్శించింది. అదే గ్రామంలో మజ్జి లక్ష్మి వ్యవసాయ క్షేత్రంలోని బొప్పాయి, ఆకుకూరలు, వరిలో లైన్‌సోయింగ్ పద్ధతులను తెలుసుకుంది. అనంతరం మూడు బృందాల అధికారులు స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ పర్యటనలో భాగంగా వ్యవసాయంలో డ్రోన్ సాంకేతికత, ప్రకృతి వ్యవసాయ ఇన్‌పుట్స్ వివరాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ పేరిన్ దేవి, ఏపీ వ్యవసాయ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, అదనపు కార్యదర్శులు మునిందర్‌కౌర్ ద్వివేది, శుభాతాకూర్, డాక్టర్ ప్రకోప్‌కుమార్ మేఘర్థ, జాయింట్ సెక్రటరీ అజిత్ కుమార్‌సాహు పాల్గొన్నారు.

కేన్సర్ సర్వేను సమగ్రంగా నిర్వహించండి: కలెక్టర్

సీతమ్మధార, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ సర్వేను సమగ్రంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ వైద్య శాఖాధికారులను ఆదేశించారు. జగదాంబ ప్రాంతంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో కలెక్టర్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్యాధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. 18 సంవత్సరాలు దాటిన యువతులు, 30 సం వత్సరాలు దాటిన మహిళలందరికీ కేన్సర్ పరీక్షలు చేయించాల్సిన అవసరం ఉందని సూచిస్తూ, ఆరోగ్య కేంద్రాలవారీగా సమీక్ష నిర్వహించారు. సర్వే కార్యక్రమం పర్యవేక్షణాధికారిణి డాక్టర్ ఎన్‌వీ సమత పరి స్థితిని వివరించారు.వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పురోగతిపై డాక్టర్ జీవన్ రాణి వెల్లడించారు.

కార్పొరేషన్లకు సభ్యుల నియామకం

విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో నాలుగు కార్పొరేషన్లకు మంగళవారం సభ్యులను నియమించింది. యాదవ కార్పొరేషన్‌లో ఎలమంచిలికి చెందిన దూలి రంగనాయకులు (టీడీపీ), మాల కార్పొరేషన్‌కు నర్సీపట్నానికి చెందిన కొండ్రు మరిదయ్య (టీడీపీ), అనకాపల్లికి చెందిన సబ్బవరపు గణేశ్ (టీడీపీ), జీసీసీ సభ్యులుగా పాడేరుకు చెందిన బొర్రా నాగరాజు (టీడీపీ), వంపూరు గంగులయ్య (జనసేన), అరకుకు చెందినా పాంగి రాజారావు(బీజేపీ) నియమితులయ్యారు.

21న భీమిలి పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

భీమునిపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 21న జాబ్ మేళా నిర్వహించనున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి టి.చాముండేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు. మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, కళ్యాణ్ జ్యువెలర్స్, మాస్ మెరైన్ సర్వీసెస్, ఎస్‌కెఎల్ అసోసియేట్స్ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. ఎంబీఏ, ఏదైనా డిగ్రీ, ఇంటర్మీడియట్, పదో తరగతి పాసైన వారంతా మేళాలలో పాల్గొనవచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖ, తగరపువలస, భోగాపురం, విజయనగరం, గాజువాక, గోపాలపట్నం, అనకాపల్లి ప్రాంతాల్లో పనిచేయాల్సి వుంటుందన్నారు. వివరాలకు 90147 58949 నంబరులో సంప్రతించాలన్నారు.

శిర్లపాలెంలో కొట్లాట

ఆనందపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తనపై కొంతమంది దాడిచేసి గాయపరిచారని శిర్లపాలెం గ్రామానికి చెందిన కోరాడ గౌరినాయుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని చెరువు స్థలాన్ని కొంతమంది ఆక్రమించి షెడ్లు నిర్మించడంతో గౌరినాయుడు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో గ్రామానికి చెందిన షణగం రమేశ్, చిన్నారావు, అప్పలరాజు తన ఇంటికి వచ్చి కర్రలు, కత్తులతో దాడి చేశారన్నారు. అడ్డుకున్న తల్లి చిలకమ్మ, సోదరి సింహాచలంను కూడా కొట్టారన్నారు. సీఐ చింతా వాసునాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరోపకారులే ఉత్తమ సేవకులు

మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ

మహారాణిపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎదుటి వారికి సాయం చేసే సేవా గుణం ఉన్నవారే దేవతలని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ అన్నారు. మంగళవారం సెయింట్ ఆంథోని పాఠశాలలో బాలల పండుగ విశాఖ బాలోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య వక్తగా మాట్లాడుతూ చిన్న చిన్న కథల రూపంలో బాలలకు మంచి సందేశాన్ని వినిపించారు. ఈ నెల 21 వరకు నిర్వహించే బాలోత్సవంలో విశాఖలోని సుమారు 40 పాఠశాలల నుంచి ఐదు వేల మంది విద్యార్థులు పలు పోటీల్లో పాల్గొంటారన్నారు. అకడమిక్ ఈవెంట్స్, వివిధ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బేతవోలు రామబ్రహ్మం, బాలవికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు, రత్న కుమార్, సుశీల, జోష్, శ్రీనాథ్, రాజేశ్వరరావు, నాగేశ్వరరావు, రమాప్రభ తదితరులు పాల్గొన్నారు.



బాలోత్సవంలో సందడి చేస్తున్న చిన్నారులు

ఘనంగా కెనరా బ్యాంకు ఫౌండర్స్ డే

- ▸▸ రక్తదానం చేసిన ఉద్యోగులు



రక్తదానం చేస్తున్న కెనరా బ్యాంకు ఉద్యోగులు

డాబాగార్డెన్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంకు వ్యవస్థాపకులు అమ్మెంబల్ సుబ్బారావు జయంతి (ఫౌండర్ డే)ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రాంతీయ కార్యాలయంలో రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమాన్ని బ్యాంకు రీజనల్ హెడ్ మధుసూదనరెడ్డి జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన బ్యాంకు చరిత్ర, సేవలను తెలియజేశారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంలో బ్యాంకు దూసుకుపోతోందన్నారు. ఉద్యోగులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. స్థానిక శాఖల్లో పలువురు ఖాతాదారులను సన్మానించామన్నారు. జిల్లాలోని అన్ని శాఖల్లో జరిగిన ఫౌండర్ డే వేడుకల్లో ఖాతాదారులు పాల్గొని బ్యాంకు సేవలను కొనియాడారన్నారు.

15 శాతం వృద్ధి సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆకాంక్ష మేరకు ఉద్యానవన ప్రగతి 15 శాతం సాధించాలని ఆశాఖ కమిషనర్ కె.శ్రీనివాసులు సూచించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని 2024-25 ఉద్యానవన ప్రగతిపై మంగళవారం జిల్లా కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆయిల్ పామ్, కూరగాయలు, జామ వంటి లాభసాటి పంటల విస్తీర్ణాన్ని పెంచాలన్నారు. నీటి సదుపాయం ఉన్న ప్రతి చోటా డ్రిప్ వేయించాలన్నారు. అదనపు సంచాలకులు కె.బాలాజీనాయక్, సీబీ హరనాథరెడ్డి, ఏపీఎంఐపీ పీవో ఎం.వెంకటేశ్వర్లు, ఉద్యాన అధికారులు ప్రాజెక్టు డైరెక్టర్లు పాల్గొన్నారు.

బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం

- ▸▸ ప్రయాణికురాలికి గాయాలు



గాయపడిన సత్యవతి

మల్కాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బస్సును డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. వివరాలిలా ఉన్నాయి. శ్రీహరిపురం నుంచి నవీన్ ట్రావెల్స్ బస్సులో కొంతమంది మహిళలు పంచారామాల యాత్రకు బయలుదేరారు. ఇందులో అనకాపల్లి జిల్లా, బుచ్చయ్యపేట మండలం గుణ్యంపూడి గ్రామానికి చెందిన 15 మంది మహిళలు ఎక్కారు. యాత్రలు పూర్తిచేసుకుని సోమవారం రాత్రి తిరుగు ప్రయాణంలో డ్రైవర్ బస్సును వేగంగా, నిర్లక్ష్యంగా నడిపాడు. బస్సు భీమవరం వద్దకు వచ్చే సరికి ప్రయాణికురాలు సత్యవతి సీటు నుంచి పడిపోవడంతో బలమైన గాయాలయ్యాయి. ఆమెకు అక్కడే వైద్యం చేయించారు. నడుము భాగానికి బలమైన గాయమయిందని, తగిన చికిత్స అందించాలని అక్కడి వైద్యుడు సూచించారు. అదే బస్సులో తిరిగి బయలుదేరి, జాగ్రత్తగా నడపాలని సూచించినా డ్రైవర్ పట్టించుకోలేదు. సరికదా అనకాపల్లిలో ఆపాలని కోరినా వినిపించుకోకుండా శ్రీహరిపురం వరకు తీసుకొచ్చాడు. దీంతో బస్సులోని వారు డయల్ 100కు సమాచారం ఇచ్చారు. గాజువాక ట్రాఫిక్ పోలీసులు బసుస్సు వద్దకు చేరుకున్నారు. మల్కాపురం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, ఉన్నతాధికారు ఆదేశాలు మేరకు ప్రయాణికులతో కలిసి బుచ్చయ్యపేట మండలం వరకు బస్సులో వెళ్లి అక్కడ వారందరినీ సురక్షితంగా దింపి, వారి నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్టు

విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులను ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని వారి నుంచి భారీగా గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ప్లాట్‌ఫామ్‌పై తనిఖీ చేస్తున్న సమయంలో ఆగ్రాకు తరలించేందుకు ప్రయత్నించిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన దేవేంద్రను పట్టుకుని అతని వద్ద నుంచి రూ.85 వేల విలువ చేసే 17 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. అలాగే ఢిల్లీకి రవాణా చేసేందుకు ప్రయత్నించిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన దీపాన్సు పరిహార్, గౌతమ్ సింగ్‌ను అరెస్టు చేసి రూ.50 వేల విలువ చేసే 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. జీఆర్పీ సబ్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.కె.అబ్దుల్ ఫరూక్, కె.శాంతారాం దర్యాప్తు చేస్తుండగా, నిందితులను పట్టుకోవడంలో ఆర్పీఎఫ్ ఏసీఐ పి.శివనారాయణ, ఎంఎల్.మీనా సహకరించారు.

నడిరోడ్డుపై ఆత్మహత్యాయత్నం

- ▸▸ బీరు సీసాతో గొంతు కోసుకున్న వ్యక్తి



ఉమామహేశ్వరరావుకు చికిత్స చేస్తున్న గీతం వైద్యులు

ఎండాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నడిరోడ్డు పై ఓ వ్యక్తి ఆత్మ హత్యాయత్నం కలకలం రేపింది. ఈ సంఘటన ఎండాడ మహిళా పోలీసుస్టేషన్ వద్ద మంగళవారం జరిగింది. పీఎంపాలెం ఎస్ఐ భాస్కర్ అందించిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన కండేపల్లి ఉమామహేశ్వరరావు (35) విశాఖ వచ్చి ఇసుకతోట బజార్ ప్రాంతంలో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతడు మంగళవారం మధ్యాహ్నం ఎండాడ మహిళా పోలీసుస్టేషన్ సమీపంలో బీరు సీసాతో శరీరంపై గాట్లు పెట్టుకుని, గొంతు కోసుకున్నాడు. స్థానికులు, పోలీసులు అడ్డుకుని గీతం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఉమామహేశ్వరరావు భార్య ఉష, కుమార్తె కీర్తన మూడేళ్ల కిందట ఇతడిని విడిచిపెట్టి వెళ్లిపోయారు. ఒంటరితనం భరించలేక ఈ అఘాయిత్యానికి పాల్పడినట్టు ఎస్ఐ వివరించారు.

14, 15 తేదీల్లో సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులకు క్రీడా పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న గాలియట్

విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాంఘిక, బీసీ, గిరిజన సంక్షేమశాఖ వసతి గృహాల విద్యార్థులకు కలెక్టర్ కప్ పోటీలు నిర్వహించనున్నామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జూన్ గాలియట్ తెలిపారు. సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయంలో మంగళవారం హాస్టల్ వార్డెన్లు, అధికారులతో ఆశాఖ డీడీ కె.రామారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వివరాలను వెల్ల డించారు. జిల్లాలో 52 హాస్టల్స్, 6,500 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. వీరికి క్రీడలపై ఆసక్తిని పెంపొందించేందుకు వీలుగా కలెక్టర్ ఆదేశాలు మేరకు పోటీలు నిర్వహిస్తామన్నారు. వచ్చే నెల 14, 15 తేదీల్లో కొమ్మాది క్రీడా మైదానంలో పోటీలు జరుగుతాయని, వ్యక్తిగత, టీమ్ కేటగిరీల్లో పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో బీసీ, గిరిజన సంక్షేమశాఖ అధికారులు శ్రీదేవి, అఖిల, వసతిగృహాల సంఘం నాయకులు మోహిని, అలివేలు మంగ, ఆనందరావు, వార్డెన్లు పాల్గొన్నారు.